# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204067
UNIVERSAL LIBRARY

# దేవేంద్రనాథ ఠాకూరు
# చరిత్రము

APPROVED FOR CLASS USE
BY THE TEXT-BOOK COMMITTEE
VIDE FORT ST. GEORGE GAZETTE
PAGE 546, DATED 20-11-1934

# మహర్షి దేవేంద్రనాథ ఠాకూరు చరిత్రము

శ్రీ దేవేంద్రనాథభట్టాచార్యుని
వంగభాషా మాతృక ననుసరించి

ఆకురాతి చలమయ్యా

ఆంధ్రీకరించినది

*

శాంతి కుటీరము

* పిఠాపురము *

సర్వస్వామ్యములు
అనువాద కర్తవి

ప్రథమముద్రణము 1934
ద్వితీయముద్రణము 1936
తృతీయముద్రణము 1937

శ్రీ విద్వజ్జన మనోరంజనీ
ముద్రాక్షరశాల : పిఠాపురము



Brahmarshi

Dr. Sir. R. Venkata Ratnam Naidu Garu,

Kt., M. A., L. T., D. Litt., LL. D.

# అంకితము

మహర్షి

తిరస్కరింపఁబడినవారిని మధురవచనములతో నోదార్చిరి. ఆపన్నుల ననాపన్నులుగ నొనర్చిరి. నిరాశచేఁ గ్రుంగి కృశించిన వారి కాశావాణిని వినిపించిరి. దుఃఖదగ్ధులకు మధురవాక్కులతో మహానందము నొనగూర్చిరి. చిన్నపెద్దలకు, ధనికదరిద్రులకు, జ్ఞానులకు, అజ్ఞానులకు అందఱికిని నానందస్వరూపులై విరాజిల్లిరి. మిత్రులనేమి, శత్రులనేమి, అనిష్టకారులనేమి, హింసాకరులనేమి, ఆత్మదూషకులనేమి, అందఱి నత్యంత సమాదరముతో సస్నేహముగాఁ దమ ప్రేమమయవక్షమునందద్దుకొనిరి.

మహర్షి యాకృ

అట్టి మహత్తరమయినట్టియుఁ, బుణ్యతమ మయినట్టియుఁ, అత్యంత పవిత్రమయినట్టియు జీవితము సంపూర్ణముగ మూర్తీభవించినట్లు ప్రభవించి

బ్రహ్మర్షియై

ఆంధ్రదేశమున కంతటికిని రత్నస్వరూపుఁడై, దేశక్షేమమునకును, మానవకల్యాణమునకును, మతవ్యాప్తికిని, దన జీవితము నంతను ధారపోయుచు నేటికిని నవనవోత్సాహముతో నిరంతర పరిశ్రమ గావించుచున్న

పరమపూజనీయులైన

శ్రీ వేంకటరత్నము నాయఁడుగారి పాదపద్మములపై బాలుర యుపయోగార్థము వికసిత మైన యీ చిన్నిపుష్పము శ్రద్ధాభక్తిపూర్వకముగా సమర్పింపఁబడినది.

# ప్రార్థన

ఓ పరమాత్మా ! అజ్ఞానకృతములైనపాపమునుండి మమ్ములను ముక్తులను జేసి, దురాలోచనమునుండి తొలఁగునట్లుచేసి, నీనియమితధర్మపాలనమునందు బ్రయత్నించు మమ్ములను యత్నశీలురనుగాఁ జేయుము. శ్రద్ధతోడను, బ్రీతితోడను, సర్వదా నీ యపారమహిమలను నీపరమమంగళస్వరూపములను జింతన చేయుటయం దుఃశ్సాహాయుక్తులనుగాఁ జేయుము. అందువలనఁ గ్రమముగా నీతోడి నిత్యసహవాసజనితమహానందము ననుభవించి మేము కృతార్థుల మగుదుముగాక !

దేవేంద్రనాథఠాకూరు



మహర్షి దేవేంద్రనాథ ఠాకూర్.

# విజ్ఞప్తి

"Lives of great men all remind us
We can make our lives sublime."

అని నుడివినటుల మన జీవితములను దిద్దుకొనుటకు మహాపురుషుల జీవితచరిత్రలు చదువుట యత్యంతావశ్యకము. అందును ముఖ్యముగా దేశకల్యాణార్థమై తమ జీవితములను ధారవోసి బహుకష్టముల పాలై, ధన్యులై తరించినవారి జీవితచరిత్రములు పవిత్రములును, ఆకర్షకములును, జ్ఞానోద్బోధకములును, ఉత్సాహోద్రేకదములును, నవజీవనోద్దీపకములును—ఇట్టి మహానుభావుల చరిత్రలు చిన్ననాఁటినుండియుఁ జదువుచుండినచో బాలురు వాని నాదర్శములుగఁ గొని తమ జీవితముల నుత్తమములైన వానిగఁ జేసికొనఁగలరు. కావున నట్టి మహాపురుషుల జీవితచరిత్రల నొక్కటొకటిగ నాంధ్రలోకమున కర్పింపఁదలఁచి తొలుదొల్త శ్రీరాజా రామమోహనరాయలవారి జీవితమును ప్రచురించితిమి. ఇప్పుడు రెండవ కుసుమముగ మహర్షి దేవేంద్రనాథ ఠాకూరుగారి యద్భుతచరితమును ఆంధ్ర యువతీయువక బాలబాలికలచేతుల కందించుచున్నాము. దీని నెల్లరును జదివి మాయుద్యమమును బ్రోత్సహింతురు గాత !

ఆకురాతి చలమయ్య

# విషయసూచిక


| | పేజి |
|---|---|
| ప్రథమ ప్రకరణము—పరిచయము | 1 |
| ద్వితీయ ప్రకరణము—స్థితిగతులు | 8 |
| తృతీయ ప్రకరణము—జన్మము | 16 |
| చతుర్థ ప్రకరణము—దేవేంద్రనాథుఁడు, శైశవము | 28 |
| పంచమ ప్రకరణము—స్వభావము | 32 |
| షష్ఠ ప్రకరణము—‘తత్త్వబోధినీసభ’ | 41 |
| సప్తమ ప్రకరణము—సంసారము | 49 |
| అష్టమ ప్రకరణము—కర్మక్షేత్రము | 54 |
| నవమ ప్రకరణము—సాధన | 64 |
| దశమ ప్రకరణము—మహర్షి | 71 |
| ఏకాదశ ప్రకరణము—శాంతినికేతనము | 79 |

# మహర్షి దేవేంద్రనాథ ఠాకూరు

## ప్రథమ ప్రకరణము

### పరిచయము

చీఁకటి వెలుఁగు లొకచోట నుండఁ జాలవు, అట్లే లక్ష్మీ సరస్వతు లెప్పుడు నొకచో వసింపఁ జాలరు. ఈ యిరువురు దేవతలకుఁ జిరకాలమునుండి పరస్పర వివాదము లేర్పడి యుండు టచే వీరిద్ద ఱొకచో సమావేశమై యొకగృహామం దుండఁజాల రని యందఱకును దెలిసిన విషయమే.

ఆ విషయము నసత్యమని త్రోసివేయఁ జనదు. కారణ మేమన, నెవ్వనిపై లక్ష్మీకటాక్ష మెంత యధికముగ నుండునో, యతఁడు సరస్వతీకటాక్షముననుండి యంతయధికముగ వంచితుఁ డగుచుండు నని దాదాపుగా నందఱకును దెలిసిన విషయమే. బీదలబిడ్డలకు విద్యార్జనయం దెంతటి గాఢానురాగ ముండునో ధనికులబిడ్డ కట్లుండుట కానరాదు. బీదలబిడ్డ లెన్ని కష్టముల నైన నోర్చి విద్య గడింప నెల్లపుడు నాతురతగలవారై యుం దురు. గొప్పవారిబిడ్డ లట్లు శ్రమపడి, విద్యగడింప నిచ్ఛగింపరు. బీదలబిడ్డ లెంతటికష్టముల నైన నోర్చి చదువను, వ్రాయను

నేర్వ నెల్లపుడును బాటుపడుదురు. ధనికులబిడ్డ లట్లు కష్టించి పాటుపడఁజాలరు.

కాని లక్ష్మీదేవికిఁ బ్రేమపాత్రులైన పుత్త్రులై, కోట్లకుఁ బడగల సెట్టి నవారి గృహమున జన్మించి, శైశవకాలమునుండియు సమస్తసుఖములతోడను, భోగవిలాసములతోడను వర్ధిలుచుండియు, దీనుల బిడ్డలవలెను, దుఃఖార్తుల బిడ్డలవలెను, సకలవిధములగు క్లేశములను బొంది నిరంతర పరిశ్రమ మొనర్చి, కఠోరసాధనను జేసి సరస్వతీదేవి నారాధించుచుండువా రామెకృపనుండి వంచితులుగారు; దానికిఁ దార్కాణములు పెక్కులు గలవు. అట్టివారి గృహములం దెల్ల లక్ష్మీసరస్వతు లిద్దఱును జిరకాలమునుండియుఁ గల తమ వివాదములను మఱచి యక్కసెల్లెండ్రవలె నొక్కచో వసింప నారంభింతురు. కఠోరమగు సాధనను చేసి యీ యిరువురు దేవతల వివాదములను దీర్చి తమ గృహములకు రావించి యీ యిద్దఱను బంధించి యుంచగలిగినవారే నిజముగ నీలోకమున మహాపురుషులు—వారే యీ ప్రపంచమున యథార్థముగ మహాపుణ్యపురుషులు; నిత్యమును బ్రాతఃకాలమున లేచినతోడనే స్మరింపదగినవారలు వారే. అట్లనుటకేమాత్రమును సందేహములేదు.

కలకత్తాలోని జోరాసాంకోయందుఁ గల ఠాకూర్ వంశ మిట్టి మహాపురుషుల వంశ మని బహుకాలమునుండియు దేశదేశాంతరములఁ బ్రఖ్యాతిని వహించినది. ఈ మహావంశమునం

దుద్భవించిన వారి కఠోరసాధనబలముచే లక్ష్మీ సరస్వతు లిద్ద ఱును దమ వివాదముల నెల్ల మఱచి బహుకాలమునుండి యొక్కడనే కలిసి వసించుచున్నారు. దీనికిఁ దార్కాణము నేఁటివఱకు సత్యోజ్జ్వలముగఁ బ్రకాశించు చున్నది.

ఈ లోకమునందలి కోట్లకొలఁది ప్రజలు సర్వసామాన్య ముగ నిద్రాహారములతోడను, లీలావిలాసఖేలలతోడను, భోగ లాలసతలతోడను, సరససల్లాపములతోడను, ధనార్జనపరత మొదలగు వానితోడను గాలము గడుపుచుందురు. కాని యీ పురాతన నియమముల బద్ధు లయ్యుఁ గొందఱు నిరంతరపరి శ్రమచే, కఠోరసాధనచే నేదేని యొక విశేషగుణమును సాధించి యభ్యసింప సమర్థులై తమదేశమునకును, ప్రజలకును,సంఘము నకును, నానావిధములగు నుపకారములను జేయుచుందురు. అట్టివారల నామము లీ విశ్వచరిత్రయందు శాశ్వతకీర్తిని గడిం చును. వారు ప్రజలచే దేవతలుగఁ బూజింపఁబడుచుందురు. అట్టివారి యాదర్శముల నెదుట నుంచుకొని, వారలు చూపిన మార్గములయందు వారివలె నడువఁగలిగినచో నెట్టివారైనను శక్తిశాలురై జగత్తునందమర నామము, నక్షయకీర్తిని గడింతు రనుట కేమాత్రమును సందియము లేదు.

మనుజున కసాధ్యమయిన దేది? గాఢ మగు నిచ్ఛను, పట్టుదలను, గలిగి వానితోడ రేయుంబవళ్లు యావచ్ఛక్తిని విని యోగించి పరిశ్రమఁ జేయఁగలిగినయెడల నందఱు నన్ని కార్య

ములను నెఱవేర్పఁగలరు. మనుజునివలనఁ గాఁజాలని కార్య మొకటియు లేదు. కాని ముందుగనే భయపడి యసంభవ మని తలంచి ప్రయత్నమునైనఁ బరిశ్రమనైనఁ గావింపక వెనుకడుగు వేసినయెడల మిక్కిలి సులభమగు కార్యమునైనను నెఱవేర్ప నసమర్థుల మయ్యెదము. నిరంతరమును గృషిచేయువారలకును మనశ్శరీరముల నొక్కటిచేసి, యెడతెగక యత్యంతము ప్రయత్నమును, బరిశ్రమను జేయువారలకును బరమేశ్వరుఁడు స్వయముగ సదా తోడ్పడుచుండును. ఒకసారి సఫలము గాకున్నను రెండుసారులు గాకున్నను నిరాశనందక మగల మరలఁ బ్రయత్నమును జేయుచున్నచోఁ దుదకు నిశ్చయముగ జయము నంద నగును. కాని యొకటిరెండుమాఱులు ప్రయత్నము చేసియు విఫలమనోరథుఁడై పట్టుదల వీడినఁగాని, యసంభవమని యెంచి ప్రయత్నమును, బరిశ్రమను జేయక విచారించుచుఁ గూర్చున్నఁగాని యట్టివానికి భగవానుఁ డెల్లపుడును దూరముగనే నిలుచును. వాఁ డెట్టిమహాకార్యమునేని, యించుకంతయుఁ దన జీవితమున నెఱవేర్ప సమర్థుఁడు గాఁ జాలకుండును.

ప్రపంచమునం దెవ్వరును బుట్టినప్పుడే గొప్పవారుగా జన్మింపరు. అందఱును దమ తమ ప్రయత్నములచేతను, సాధనముల చేతను, సంకల్పములచేతను, నిమ్నస్థితినుండి యున్నతస్థితికి బోవలసియుందురు. మిగుల దీనులును దరిద్రులు నగువారి గృహములందు జన్మించి యెల్లవారి పాదములయొక్క ధూళియందు నడఁగి

మడఁగి యుండియు, నెందఱెందఱు కేవలము తమ స్వప్రయత్న ములచేతను, స్వశక్తిచేతను, స్వావలంబిత సాధనప్రణాళీప్రభా వముచేతను, దుదకు లోకమునందు దేవతుల్యులును, బూజనీ యులును, భక్తిభాజనులును గాఁగలిగినవారలు లేరు ? వారల యాదృష్టాంతములు నేఁటిదనుక దేశచరిత్రయందు నక్షత్రముల భాతి జాజ్వల్యములుగా విరాజిల్లుచున్నవి. గొప్పతనము సంపా దించుపనివారగుట తమ తమ చేతులయందే యున్నది. సాధ నముఁ జేయఁగలిగినవారందఱు నట్లు కాఁగలరు. కాని కేవలము కోరిక గలిగి భగవానునిపై భారము వైచి తా నెట్టి పరిశ్రమ మును జేయక మిన్నకున్నయెడల మనుజుఁ డెట్టి సాఫల్యము నొందఁజాలఁడు అలసులు, విలాసప్రియులు, కాపురుషులు, భగవానునిపై నేరము మోఁపి, తమ యదృష్టముపై నాధార పడి నిర్జీవులవలెఁ బడియుందురు. ఇట్టి మనుజులు తమ జీవిత మం దెప్పుడు నెట్టి యౌన్నత్యమును బొందఁ జాలరు. కాని యత్నశీలురు, సాహసము గలవారు, నోర్మితోఁ బరిశ్రమచేయు వారును, తమ శక్తిపై నాధారపడియుండి తమ యదృష్టమును నిర్మించుకొనుచుఁ బరిణామమున గొప్పవారై పరమసుఖసం పన్నులగుదురు. జగత్తునందు సదాపూజ్యతను గాంచుచుందురు.

* జోరాసంకోతాకూరువంశము గూడ నీ విధమున బహుకా లమునుండి లోకమునందుఁ బూజ్యత నొందుచున్నది. మిక్కిలి

---

* కలకత్తాలో అప్పర్ చిట్‌పూర్ రోడ్డునందుఁగల ఒక భాగము పేరు.

నొప్పగృహములలో జన్మించియు, సమస్త ధనైశ్వర్యములను బొందియు నావంశీయులు వానిని నిలుపుకొనఁజాలక యత్యల్ప కాలమునందే వాని నన్నిటిని బోఁగొట్టికొని వంశపుపేరునుగూడఁ జెడిచి వైచి నిరుపేదలును, బేరైన లేనివారు నగుచుండుట మన మనేకస్థలములఁ గాంచుచున్నాము. ఎట్టి కఠోరపరిశ్రమమును జేసి పూర్వపురుషులు పేరు ప్రఖ్యాతులను మహైశ్వర్యములను గడించి గతించిరో వారి వంగడమునఁ దరువాతివారు నట్టి కఠోరసాధనమును జేయుటచేతనే వాని నన్నింటిని బ్రతికించి యుంచవలయును. అట్లు కానిచోఁ గష్టార్జితసాధనఫలము నిం కొకరనుభవింపలేరు. ఎవరి యార్జనము వారితోడనే యంతరించిపోవును. ఎవరి వంశజులు వారి పూర్వపురుషుల కీర్తికలాపములను చెడకుండ నుంచఁగలరో వారే యిజ్జగంబున ధన్యులయి యుందురు.

ఠాకూరు వంశపువారు నీవిధమునఁ దమ వంశనామమును, ధన్యమొనర్చి, ధన్యులయిన మహాపురుషులు. వీరల పూర్వపురుషులే ధనైశ్వర్యములను గీర్తిని నిందుండి గతించిరో వీరు వాని నన్నిటిని జెడకుండ నిలిపిరి. అంతటితోఁ దృప్తులై యుండక తమ మొదతెగని ప్రయత్నములచేతను, పరిశ్రమచేతను, కఠోరపరిశ్రమముచేతను వాని నన్నిటిని ననంతములుగ నభివృద్ధి చేసి దేశదేశములందును మహాకీర్తిని గడించి రక్షించుచున్నారు.

ఈ వంశమునందలి పురుషులుమాత్రమే యీకార్యమును నెఱవేర్చుచున్నా రనరాదు. స్త్రీలుకూడఁ బురుషులతోపాటు

సమానముగఁ బరిశ్రమము గావించి యీమహాకఠోరకార్యమును సాధించుచున్నారు. కావుననే యీవంశపు పేరుప్రతిష్ఠలు నేఁడు దేశదేశములం దెల్లెడ వ్యాపించినవి. వర్తమానకాలమున నీదేశమందేమి మఱేదేశమునందేమి వీరి వంశనామమును వినని వా రెవరు నుండరు. కవిసమ్రాట్టగు రవీంద్రుఁడేమి, ద్విజేంద్రనాథ ఠాకూరేమి, సత్యేంద్రనాథ ఠాకూరేమి, వీ రందఱును, చిరకాలము స్మరింపఁదగినవారును, బూజింపఁదగినవారు నగు స్వర్ణకుమారీదేవి, సరళాదేవి, మొదలగు మహిళామణులేమి యీమహావంశముయొక్క ప్రతిభ నినుమడింపఁజేసినవారే.

ఈ వంశీయులైన స్వర్గీయ ద్వారకానాథ ఠాకూరుగారు "ప్రిన్స్" అను ప్రఖ్యాతనామమును బొందినంతనే వంగదేశమెల్లఁ గాంతిమంత మయ్యెను. ఆయనకుఁ బూర్వ మీమహాసన్మానయుక్త మగు పేరిఁక నెవ్వరును బొందియుండలేదు.

ఈస్వర్గీయ ప్రిన్స్ ద్వారనాథ ఠాకూరుగారి జ్యేష్ఠపుత్రులే మన మహాపురుషులగు మహర్షి దేవేంద్రనాథఠాకూరుగారు.

# ద్వితీయ ప్రకరణము

## పరిస్థితులు

చిరకాలమునకుఁ బూర్వపు మాట గాదు. ఆంగ్లేయుల పరిపాలనమునకు వచ్చియున్నను నాఁటిదినములలో మనదేశ మిప్పటి యీయౌన్నత్యస్థితిని జెందియుండ లేదు. నలువైపుల నిన్ని బడులు, ఇన్ని కళాశాలలు, ఇన్ని గ్రంథాలయములు, ఇన్ని సభాసమితులు, ఇన్ని పఠనాగారములు, మొదలగునవి లేకుండెను. ఇప్పటివలె దేశమునం దింతమంది యున్నతవిద్య నేర్చుకొనుట కవకాశము కూడ లేకుండెడిది. అప్పు డెంతయో కష్టముతోఁ బరిశ్రమ కోర్చి, వీడని గాటమగు పట్టుదలతో నున్నతవిద్య నేర్చుకొనవలసి యుండెడిది. కావున నావిధమున విద్య గడించినవారు నేఁటికన్న మిన్నగ నన్నివిధముల నున్నతవిద్యను బొంది సంఘమునందలి సామాన్య మానవకోటికన్న నత్యంతోన్నతస్థానమును బొందుదు రన్న సందేహ మేమి?

కేవలము నంతియే కాదు. ఆదినములలో నిట్టి యున్నతవిద్య గడించువారే యొకరిద్దఱో యుండిన నట్టివారియొక్కయు, దేశముయొక్కయు, సంఘముయొక్కయు నౌన్నత్యమునకై దేశీయు లెల్లర నేత్రములుఁ గేంద్రీకృతము లగుచుండెడివి. కావున నా పండితవరేణ్యు లిప్పటివారివలె స్వార్థపరులై కూర్చుండి

యుండెడివారు గారు. పరోపకారమునకై, దేశోన్నతికై, య హోరాత్రములు యావచ్ఛక్తిని వినియోగించి బహుపరిశ్రమము గావించి యందఱ కృతజ్ఞతకును బాత్రు లయ్యెడివారు. మఱియు దేశదేశాంతరములలో మహాపురుషు లను నమరనామమును, నక్షయకీర్తిని గడించెడివారు. స్వర్గీయ విద్యాసాగరుఁడు, రాజా రామమోహనరాయలు, మధుసూదనుఁడు, కేశచంద్రసేను, బంకించంద్రుఁడు, కృష్ణదాసు, రమేశచంద్రుఁడు మొదలగు నీదేశపు మహాపురుషు లందఱు దానికిఁ దార్కాణములై యున్నారు. వర్తమానకాలమున దేశ మింతటి యౌన్నత్యమును జెందుటకుఁ గారణము ప్రాతఃకాలముననే స్మరించుకొనఁదగిన యామహాపురుషు లందఱ కఠోరసాధనబలమే యని చెప్పవలసియున్నది. మున్ముందుగూడ మన మామహానుభావు లందఱి యాదర్శముల సమక్షమునం దుంచుకొని వారలు చూపిన మార్గములలో నడచినఁగోలఁది మనకును మనదేశమునకును దినదినము నధికతరౌన్నత్యము చేకూరు ననుట కేమాత్రమును సందియము లేదు.

నది పొంగి వఱదవారి యొడ్లనొరసి గండ్లువడి పలుతెన్నులఁ బాఱి ప్రవహించునపు డాప్రవాహము దేశముల గ్రామములఁ, బ్రాంతముల, మార్గముల నన్నిటిని ముంచి యేకమట్టము చేయును. అందలి పాఁత వెన్నియో కొట్టుకొనిపోవును. ఒక దేశమునం దొక నూతనవిషయము ప్రవాహమువలెఁ బొంగి ప్రవహించునపు డాప్రవాహముయొక్క యుద్వేగముచేతఁ జిన్న

పెద్ద యనక దేశీయుల నందఱను ముంచివేయును. ఆకాలమున నట్లే యీమనదేశమునం దాంగ్లవిద్యాస్రవంతి తరంగములతోఁ బొంగి పొరలి ప్రబలవేగమునఁ బ్రవహింప నారంభించెను.

ఎప్పుడే దేశమున నే జాతివాఁడు రాజగునో యప్పుడాదేశమున నతని భాషయే సువ్యాప్తమగును. ఆభాషయందే యెక్కువగఁ బనులు జరుగుచుండును. కావున దేశీయు లెవ రెంతగ నాభాష నేర్చుకొనఁగలరో యంతటి యున్నతోద్యోగములను బొంది యెక్కువ ధన మార్జించి దేశమునం దెక్కుడు గౌరవార్హు లగుచుందురు ?

ఇంగ్లీషువారి పరిపాలనకుఁ బూర్వము మహమ్మదీయుల పరిపాలనయందు ఫార్సీ, ఉర్దు మొదలగు భాషలే ప్రబలములై యుండెను. అప్పటివా రాభాషల నన్నిటిని క్రమముగా నేర్చుకొని యుత్తమజ్ఞానమును బొందెడివారు. కాని యాంగ్లేయు లీదేశమున రాజ్యమును స్థాపించినప్పటినుండియు నాంగ్లేయభాష యీదేశమునందు వ్యాపింప నారంభించెను. ఆఫీసులలోఁ గోర్టులలోఁ బను లన్నియు నాంగ్లమున జరుగుచుండెను. అపు డింగ్లీషుభాష నేర్చుకొనుట యత్యంతావశ్యక మయ్యెను. ఈదేశీయు లాంగ్లవిద్య నేర్చుకొనఁ బ్రోత్సాహింపఁబడిరి.

కాని యీదేశమునం దపు డింగ్లీషు నేర్చుకొను మార్గమేమి? ఇంగ్లీషు నేర్చుకొనుట కపుడు విద్యాలయములు లేవు. ఆంగ్లేయు లాలోపమును దీర్చుటకై యీదేశమునందు విద్యాలయ

ములు స్థాపించిరి. ఆకార్యమును మొదట నెఱవేర్చిన దెవరు? ఇంగ్లీషు పాదరీలే యాలోచనను దీర్చి యీదేశమున మిషనరీ స్కూళ్లు స్థాపింప మొదలిడిరి. దేశీయులును వారి దయకుఁ బాత్రులై యావిద్యాలయములలో నాంగ్లేయవిద్య నేర్చుకొన సమకట్టిరి. చూచుచుండఁగనే మిషనరీ విద్యాలయము లన్నియు విద్యార్థులతో నిండిపోయెను.

దీనివలన నాంగ్లేయభాష నేర్చుకొనుట కవకాశ మేర్పడె ననుట నిజమే. కాని యింకొక విషయమున నొక గొప్ప యన ర్థమును గలిగెను. ఆ మిషనరీవిద్యాలయములలో విద్య నేర్చు కొనుచున్న సమయమున విద్యార్థుల బుద్ధిగతులు వికృతాకార ములఁ దాల్పఁజొచ్చెను. హిందూధర్మముపై నభిలాష యడు గంటెను. స్వభావచరిత్రలు వినాశ మొందుచుండెను. గురుజను లపై శ్రద్ధాభక్తు లడుగంటెను. ఈశ్వరభక్తి సన్నగిల్లెను. సదా చారములపై నేవగింపు జనించెను. క్రమముగ ననేకులు క్రైస్త వమతము నవలంబించిరి. అనేకులు ప్రత్యక్షముగ క్రైస్తవధర్మ మును స్వీకరింపకున్నను లోలోపల హిందూధర్మముపై నేహ్య భావమును గనఁబఱచుచుండిరి. దేశీయు లాంగ్లవిద్య నేర్చుకొని యన్నివిధముల నౌన్నత్యమును బొందుచున్నకొలఁది హిందూ సంఘమునం దొక ఘోరతరాందోళనమును, కఠినసాంఘిక నిర్బం ధము నారంభ మాయెను.

అనంతర మీదేశమున నున్నతవిద్య నేర్పుటకు హిందూ

కాలేజీ స్థాపింపఁబడినపు డిఁక నీయాందోళనము, ఈసాంఘిక నిర్బంధము తగ్గిపోవచ్చునని యందఱకు నాశ జనించెను. ఈ కాలేజీయందు విద్యార్జనముతోపాటు నీతిధర్మవిషయములఁగూడ శిక్షఁ బొంది యందఱును మరల హిందూధర్మముపై భక్తిగల వా రయ్యెద రనియుఁ, బూర్వమువలె సద్ధర్మ సంపన్ను లయ్యెద రనియుఁ దలంపఁజొచ్చిరి. కాని యది భిన్నముగఁ బరిణమించినది. విద్యావిషయమున హిందూకాలేజీ విద్యార్థులు దినదినము నౌన్నత్యమును బొందుచున్నను, ననేకులు నానావిషయములఁ బండితులై దేశాభివృద్ధికిఁ దగినవా రగుచున్నను వారల మానసిక స్థితిగతు లోకించుకయు మాఱకుండెను. అనేకులు హిందువులును గాక క్రైస్తవులును గాక నాస్తికు లగుచుండిరి.

సకల మతములందలి శాస్త్రముల నియమములును, సమముగ నుదారము లయినవే, యున్నతము లయినవే, మహత్తరము లయినవే. కావున నెవ రేధర్మము నవలంబించినను, నాయాధర్మ మతముల ననుసరించి న్యాయపరాయణులుగను, గర్తవ్యనిష్ఠులుగను, దయాళురుగను, నున్నత చరిత్ర సంపన్నులుగను, నుదారభావోపేతులుగను నుండి సంసారమున జీవయాత్రను నిర్వర్తించుకొనుచు లోకమునకు బహువిధముల హితములఁ గూర్పవచ్చును. అట్లు గావింపకున్నను వారు తమ తమ ధర్మచర్యల నిమగ్నులై యుండిన దేశమునకుఁగాని, లోకమునకుఁగాని యెట్టి యనిష్టమును సంభవింపదు. కాని యెట్టి ధర్మము ననుస

రింపనివారు నెట్టి ధర్మశాసనములకును బద్ధులై యుండనివారు ధర్మహీనులును, నాస్తికులు నై యుండుటయేగాక, దేశమున కెవ్వరు నెట్టికల్యాణమును జేకూర్పఁజాలరు. అట్టివారిచే విపరీత ఫలమే ఫలించుచుండును. వారలచే దేశమునకును బ్రజలకును సంభవించు ననిష్ట మనివార్యమై యుండుననుట కేమాత్రమును సందియము లేదు.

కావున హిందూకాలేజీయం దున్నత విద్యను బొందియు దేశమునందలి యువకు లనేకులు నాస్తికులై భయంకర దుశ్చరితు ప్రైపోవుచున్నపుడు దేశీయుల మనస్సులలో నొక తీవ్రతరభయ ముదయించెను. దారుణములగు సంఘవిప్లవసూచన లారంభమయ్యెను. అందఱును మిక్కిలి భీతిఁ జెంది తన్నివార ణోపాయముల నారయ మొదలిడిరి.

కాని భగవానుని విధానము లతి విచిత్రములు. మనుజుని యభ్యుదయమునకు, నౌన్నత్యమునకు నేయే యుపకరణ సామగ్రి మిక్కిలి యావశ్యక మగుచుండెనో దానిని తనంతటఁ దానే మన కొతఁ డందించుచుండును. హిందూధర్మము మహా సంకటావస్థయం దున్నపుడు, దేశము దారుణస్థితియం దున్నపుడా నాస్తికతాప్రవాహమును మరల్ప నుద్దేశించి యాతఁ డొక మహాశక్తి సంపన్నుఁ డగు మహాపురుషుని బంపెను. ఈ మహా పురుషుఁడే స్వర్గీయ రాజా రామమోహనరాయలు. *

* శ్రీరాజర్షి రామమోహనరాయల చరిత్ర తెలుఁగులో నావద్దనున్నది. వెల రు 0-8-0.

ఆంగ్లేయ విద్యతో పాటీదేశమునం దొకధర్మవిప్లవ మారంభమగు నని రామమోహనరాయలు మున్ముందుగనే గ్రహించి నిద్రాముద్రితమై యుండిన ప్రాచీన వైదిక ధర్మమును బున రుద్ధరించి దాని ప్రభావమున దేశమునందలి ధర్మవిప్లవమును నివారింపఁజేయ మొదలిడెను. కాని వారు ప్రచారము చేసిన యా బ్రాహ్మధర్మము శుద్ధమగు వేదాంత ధర్మానుసారముగఁ బ్రచారిత మగు యుండుటచే సర్వసాధారణ ప్రజల కత్యంత కఠినముగ నుండెను. కావున వారి నిజాభిప్రాయములను గ్రహింపలేకయు, నాతఁడు ప్రచారముసేసిన బ్రాహ్మధర్మమునఁ బ్రవేశింపలేకయు, నప్పటి హిందూ సంఘము రామమోహనుఁడు ధర్మద్రోహి యనియు, సంఘద్రోహి యనియుఁ దలంచి యా మహాపురుషు నట్లు తూలనాడఁ జొచ్చెను. కావున రామమోహనుని కాలమున నాతని కార్యము ఫలమును బొందఁజాలక పోయెను. కాని యాతని యాకార్యదీక్షయే యనంతరము ఫలించి దేశమును ఘోరతర ధర్మవిప్లవమునుండి రక్షించెను. పిమ్మట నేఁటి దనుక ననేకవిధముల దేశము నుద్ధరించుచున్న దనుట కేమాత్రమును సందియము లేదు.

జోరాసంకో ఠాకూరువంశపు నామమును సార్థకపఱచుటచే ధన్యు లగు ప్రిన్సు ద్వారకనాథ ఠాకూరుగారికి శ్రీ రామ మోహనరాయలవారికిని నత్యంత సమీప బంధుత్వ ముండెను. ప్రిన్సు ద్వారకానాథుఁడు తన స్నేహితుని హృదయమును

జూడఁగలిగెను. ఆయనయొక్క మహోదారాంతఃకరణమును గ్రహింపఁగలిగెను. కావున నాతఁడు రామమోహనుని వైపున కత్యంతము నాకర్షింపఁబడి స్నేహితునిపైఁ బరమశ్రద్ధాభక్తులఁ జూపెడివాఁడు.

రామమోహనుని గుణగణము లనేకములు. ఆయన మహాపండితుఁడు, సర్వశాస్త్ర విశారదుఁడు. అతఁడు మహావక్త, పరదుఃఖకాతరుఁడు, సాహససంపన్నుఁడు, తేజస్వి, క్షమాశాలి. కాని సుగుణముల కాధారస్వరూపి యయ్యు నాతఁడా కాలపు గొప్పగొప్పవారిదృష్టికి దూరుఁడై యుండెను. క్రైస్తవ ధర్మస్వీకరణ మనెడి యీ ప్రవాహమునుండి యువకులను రక్షింపఁ గలకత్తాయందు హిందూ కాలేజీ ప్రతిష్ఠింపఁ బడినపుడా కాలేజీలో సాధారణవిద్యతోపాటు నీతి ధర్మవిషయముల శిక్షనుగూడఁ గఱపవలె ననియు నట్లైన యువకుల బుద్ధిగతులు, ధర్మము వైపునకు మరలు ననియు హిందూసంఘ ముద్ధరింపఁ బడు ననియు, నా కాలేజీ యధికారు లుద్దేశించిరి.

కాని, గార్యమునం దది విపరీత మయ్యెను. ఇంతకుఁ బూర్వమే మహాత్ముఁ డగు రామమోహనుఁడు బ్రాహ్మధర్మమును బ్రచారము సేయ మొదలిడెను. కావున నందఱు నాయనపైఁ గోపగించిరి. ఆయనను ఘోరతరధర్మద్రోహి యని తలంచిరి. అట్లెంచియే హిందూకాలేజీ యధికారులు రామమోహనుని దమ సంఘమునుండియు,సంబంధమునుండియు దూరముగ నుంచి

తమ యిష్టానుసారముగఁ గాలేజిని నడపఁజొచ్చిరి. కాని తత్ఫలితము విపరీతముగఁ బరిణమించెను. యువకులు హిందువులును గాక క్రైస్తవులునుగాక యుండిరి. దీనిని గాంచి రామమోహనుఁడు సాధారణవిద్యయు, ధర్మవిద్యయును గఱపుటకు దేశమునం దచ్చటచ్చట నిజవ్యయముతో విద్యాలయములను స్థాపించెను.

## తృతీయ ప్రకరణము

### జన్మము

లోకమున వెలుతురుఁ జీఁకటియు రెండు నుండును. చెడు వస్తువుల నలువైపుల విచ్చలవిడిగ వెదచల్లినపుడు వానిలో వెదకి చూచినయెడల మంచివస్తువులు కూడ దొరకవచ్చును.

రామమోహానునకు నలువైపులఁ బ్రబలశత్రువు లున్నను ఆయనను ధర్మద్రోహి యని దేశీయు లసహ్యతతో, నవజ్ఞతతో, నవమానపఱుచుచున్నను, నాయన కాంతరంగిక స్నేహితుల కభావము లేకుండెను. ఇట్టి స్నేహితుల ప్రోత్సాహమును, సానుభూతిని బొంది తన గంతవ్యమార్గమున దినదినమును ముందునకుఁ బోఁజొచ్చెను. వీరిలో ప్రిన్స్ద్వారకానాథఠాకూరే రామమోహానునకుఁ బ్రధానసహాయుఁడు.

రామమోహనుఁడే యథార్థమహాపురుషుఁ డనియు, దేశక్షేమమునకును, లోకకల్యాణమునకు నాయనమనస్సు పరితపించినటుల నింకెవ్వరిమనస్సును బరితపించుట లేదనియు ద్వారకానాథుఁడు గ్రహింపఁ గలిగెను. దేశముయొక్క భావిస్థితిని గుఱించి యాతఁడు వ్యాకులతఁ జెందినటుల నింకెవ్వరునుఁ జెందరైరి. ఆభావిస్థితియందలి యనిష్టముల నన్నిటిని నివారింప రామమోహనుఁడు నిర్విచారముగ స్వార్థరహితుఁడై తన సర్వస్వమును సంపూర్ణముగ నర్పింప బద్ధకంకణుఁడై యుండెను. ఇట్లెవ్వరునుఁ జేయఁగలిగి యుండలేదు. చేయఁజాలను లేరు.

అందుచే నాయన రామమోహను నత్యంత శ్రద్ధాభక్తులతోడను, ప్రగాఢప్రేమతోడను జూచుచుండెను. ఆయన చేయు ప్రతికార్యమునకుఁ జేయూఁతయై నిలుచుచుండెను. మఱియు నాయన యాధర్మములనే మనసునందుంచుకొని, యాయన చూపిన మార్గమందే తానును నడచి, తన పరివారమునుగూడ నడపి యుత్కృష్టదృష్టాంతమును గనఁబఱచిరి.

రామమోహనుని యిచ్ఛానుసారముగా ద్వారకానాథుఁడు తన జోరాసంకోయందుఁ గల మహావిశాలభవనమునం దొకభాగమున రాయలవారు ప్రచారమొనర్చుచున్న బ్రాహ్మధర్మమునకుఁ బ్రప్రథమమున నొకమందిరమును బ్రతిష్ఠించెను. దీని పేరే "ఆది బ్రాహ్మసమాజము."

ఆ యాది బ్రాహ్మసమాజమందిరమునందే నాలుగుబాలిచేఁ

ప్రచార మొనర్చఁబడిన ధర్మము ననుసరించి సకల క్రియాకలా
పములు ననుష్ఠింపఁబడుచుండెను. పూజాప్రార్థనలు, ధర్మచర్చ
లు మొదలగున వన్నియు జరుగుచుండెను. ప్రిన్స్ ద్వారకా
నాథుఁడు, స్వయముగ నియమమునను సరించి యచ్చటికేతెంచు
చుండెను. తన పరివారమువా రందఱి నందుఁ బాల్గొనునటులఁ
జేయుచుండెను. ఈవిధముగ నప్పటినుండియు జో'రాసంకో ఠా
కూరువంశము, రామమోహన ప్రచారితధర్మమును స్వీకరించి
"బ్రాహ్మధర్మావలంబు"లని మిక్కిలి ఖ్యాతివడసిరి. నాఁటినుండి
నేఁటివఱకును ఠాకూరువంశము వారందఱు నట్టిబ్రాహ్మధర్మా
వలంబులనియే ప్రసిద్ధిఁ బడసి యున్నారు.

కాని యీవిధమున బ్రాహ్మధర్మమును స్వీకరించి ప్రిన్స్
ద్వారకానాథుఁ డంతటితో మాత్రము నిలిచియుండలేదు. తన
వంశమునందలి స్త్రీలేమి, పురుషులేమి, యందఱు నన్నివిధముల
నున్నతవిద్యాలయం దారితేరి యందఱకు నాదర్శప్రాయులై
యుండుటకును దేశమునకును, దేశీయులకు ననేకప్రకారముల
నుపకారము నున్నతిని గలిగించుటకును వలయు మార్గముల
నారయ సమకట్టెను.

రామమోహనుఁడు సర్వశాస్త్రవిశారదుఁ డగు మహాపండి
తుఁడు. శాస్త్రవాదములయందును, విద్యాచర్చలయందును,
నూతనవిషయములను గ్రహించుటయందు నాయన యత్యం
తాసక్తి గలిగియుండెడివారు. ఎల్లపుడు నావిషయములందే నిమ

గ్నులై యుండెడివారు. కనుక నాయనకుఁ బరమస్నేహితులైన పిన్స్ ద్వారకానాథుని కుటుంబమువారును వానికిఁ బరిచితు లేల కాకుందురు?

ఠాకూరు వంశమువారుగూడ రామమోహానునివలెనే శాస్త్రప్రసంగములయందును, విద్యాపరిశీలమునందును, యానచ్ఛక్తిని నిమగ్నులైరి. పురుషులేమి, స్త్రీలేమి, యందఱి మనస్సులలో నొక నూతన మగు నాశాజ్యోతి యుదయించెను. అందఱు నవీనోత్సాహముతో నిరంతర పరిశ్రమతో నానావిధవిద్యార్జనముల నారంభించిరి. సరస్వతి తన విహారవనమును వీడి జోరాసంకో ఠాకూరు గృహమునందు నివసింప నారంభించెనా యను నట్లాయెను.

ఎవరికైనను వారి పరిశ్రమము ననుసరించియే ఫలిత ముండును. ఠాకూరు వంశమువారి యీ నిరంతర కఠిన పరిశ్రమఫలమేమో యనునట్లు చూచుచుఁ జూచుచుండఁగనే ఠాకూరు వంశమువా రందఱును వివిధవిద్యల నద్వితీయపండితులైపోయిరి. దేశ దేశాంతరములకు వారల విద్యాగౌరవగాథలు వ్యాపింపఁ జొచ్చినవి. దాని యీ యమృతమయ పరిణామఫలమే నేఁటి దనుక నిలిచియున్నది.

హిందూకాలేజీ యధికారులు రామమోహానుని బరిత్యజించి విద్యాలయకార్యముల నడప మొదలిడినపు డాయన దుఃఖింపలేదు. దేశీయు లందఱకును గల్యాణ మగుఁగాక! దేశవాసు

లందఱు నౌన్నత్యమును బొందుదురుగాక ! యనియే యాయన హృదయ మెప్పుడును గాఢముగఁ గాంక్షించుచుండెను. ఆ యున్నతి కేవల మొక్క యుపాయముచేతనే లభింపఁగలదు. అది ధర్మజ్ఞానముతోఁ గూడినవిద్య నొసంగుటయే.

ఆయనను వదలి హిందూకాలేజి యధికారు లట్టి ధర్మజ్ఞానముతోఁ గూడిన విద్యాశిక్ష నొసఁగఁ గలిగినయెడల దేశీయులకు విశేష మగునుపకారమును మహౌన్నత్యమును జేకూరెడివనుట కేమాత్రము సందేహము లేదు. అట్లయిన నీ మహాకార్యరూప మగు దేశసేవనుండి వేఱై పోయినను రామమోహనున కెట్టి విచారము నుండెడిది కాదు. ఎట్టులనఁ, బునాదియందే ధర్మబలము లేనిచో నెవ్వరు నెన్నఁడేన, నున్నతి నందజాలరని రామమోహనుఁ డెఱుఁగును. ధర్మబంధనములు శిథిల మైనకొలఁది సంఘమునందు ఘోరతర మగు దుర్నియమములు, దురాచారములు, ప్రబల మగుచుండును. ఆ కారణమున దేశవాసులు వినాశ మొందుచుందురు. కావున సాధారణవిద్యతోపాటు ధర్మశిక్షణముగూడఁ గఱపుట మిక్కిలి యావశ్యకము.

ధర్మశిక్షణము లేనిది సాధారణవిద్య యెంత నేర్చినను దాని వలన సత్ఫలములు ఫలింపవు సరికదా, దుష్ఫలములే యెక్కువగా ఫలించు చుండును. కావున ధర్మవిజ్ఞానహీన మగు విద్యను విద్య యనక యవిద్య యనుట కైన నాయన జంకెడివారు. దేశీయులుజన్మజన్మాంతరములవఱకుఁ బరమమూర్ఖులై యున్నను

మంచిదే కాని ధర్మజ్ఞానహీన మగువిద్యను వారికిఁ గఱపకుండు టయే యుత్తమము.

కాని క్రైస్తవమిషనరీలశక్తిని గ్రిందుపఱచుటకు దేశీయులందఱు నేకమై "మహావిద్యాలయ" మనుపేర హిందూ కాలేజిని స్థాపించినపుడు తత్సంబంధమునుండి రామమోహనుఁడు వేఱై యున్నను, దన హృదయగతాభిప్రాయానుసారముగనే పను లొనర్పఁబడుచుండుటను గాంచి యాతఁ డెంతయో సంతసించెను. కాని భగవానుఁ డాయనయొక్క యామహోద్దేశముల నెఱవేర్ప నంతరాయముఁ గల్పించెను. రామమోహనుని వదలి పను లొనర్చినందులకు ఫలితముగ హిందూకాలేజి యం దట్టి ధర్మజ్ఞానసంపన్నవిద్య నెవరును గఱపలేకపోయిరి. ధర్మవిహీనవిద్యాపరిణామ మేవిధమున ఫలింపవలెనో యట్లే ఫలించుచుండెను. ఉన్నతవిద్యయం దుత్తమజ్ఞానసంపన్నులై దేశవాసులు హిందూధర్మమును, హిందూసంఘము నుద్ధరించుటకు బదులుగ విపరీతకార్యములఁ జేయ నారంభించిరి. సంపూర్ణముగ ధర్మజ్ఞానశూన్యులై, నాస్తికు లైపోవఁదొడఁగిరి.

అపుడు రామమోహనుఁడు లోలోపలఁ బ్రమాదావస్థ సంభవింప నున్న దని యూహించెను. దేశవాసు లాయనపైఁ గోపావేశులై యుండిరి. ఇట్టి స్థితియందు వార లాయన సలహాల ననుసరించి యాపన్నివారణమునకై యుపాయముల నారయు పరిస్థితులు కన్పించుటలేదు. ఆయన స్వయముగనే కార్యభార

మును స్వీకరింపవలయు నని తలంచెను. అపు డాయన తనకు సహాయులగు స్నేహితులతో నాలోచించి తా నొక ప్రత్యేకవిద్యాలయమును స్థాపించెను.

ఈకార్యమునందు ప్రిన్సు ద్వారకానాథఠాకూ రాయన కనేకవిధములఁ దోడ్పడ నారంభించెను. తన వంశస్థులగు బాలబాలికల నందఱ నావిద్యాలయమునఁ జేర్పించెను. తమ బంధుబాంధవు లందఱును దమ బిడ్డలను రామమోహనుని విద్యాలయము నందుఁ జేర్పించునటుల రేయింబవళ్లు ప్రయత్నముచేయ మొదలిడెను. ద్వారకానాథుని యీయుద్యమము సఫలీకృత మయ్యెను. అతికాలముననే యీవిద్యాలయము విద్యార్థిబృందముతో నిండిపోయెను. చిరకాలమువఱకు నత్యంతౌన్నత్యముతో నావిద్యాలయము దనరారుచుండెను.

ఇంతకుఁ బూర్వమే ద్వారకానాథుని ధర్మపత్ని గర్భము దాల్చియుండెను. రామమోహనుఁడు తన తీక్ష్ణసూక్ష్మదృష్టిచే నానావిధములైన మంగళకరలక్షణములను జూడఁగలిగి యీవిషయముల నన్నిటినిఁ దన ప్రియస్నేహితుని కెఱింగించెను. ద్వారకానాథుని యానందమునకు మేర లేకుండెను. ఆయన రామమోహనుని మహాపురుషుఁ డనియే యెఱుఁగును. కావున నాయన వాక్యము లసత్యములు గానేరవు. ఆయన కా విషయమునం దత్యంత దృఢవిశ్వాసము జన్మించెను.

రామమోహనుఁ డందఱి యెదుట స్పష్టాక్షరములతో నీబిడ్డ

సాధారణమైనవాఁడు కాఁడనియు, నీతఁడు మహాపండితుఁడుగ, మహాధార్మికుఁడుగ నవతరించు ననియుఁ జాట మొదలిడెను. ఈతని జన్మచే వంగదేశమంతయు ధన్యమై పవిత్ర మగును. దేశ వాసులను మహాధర్మవిప్లవమునుండి రక్షించి దేశమున కశేష కల్యాణములను సమకూర్చును.

కావున నందఱు నాతురతతో నా భావిమహాపురుషుని యాగ మనమునకై నిరీక్షించుచుండిరి. తుదకు 1818 వ సంవత్సరము, మే మాసమున, ఠాకూరువంశము నుజ్జ్వలపఱిచి యాదేవప్రతిముఁ డగు నవకుమారుఁ డుద్భవించెను.

## చతుర్థప్రకరణము.

### దేవేంద్రనాథుఁడు — శైశవము

ప్రపంచమునం దేదో యొక యనిష్టము ఘటిల్లినయెడల దాని యమంగళ సూచకచిహ్నము లది ఘటిల్లుటకుఁ బూర్వమునుం డియే స్పష్టముగ గోచరించుచుండును. అటులనే శుభములకును మంగళసూచక చిహ్నములుగూడ ముందుగనే పొడసూపు చుండును.

ఈనవకుమారుఁడు జన్మించుటకుఁ బూర్వమే యట్టి శుభ సూచకలక్షణము లనేకులు గాంచి యెఱింగి రామమోహ నుఁడు ముందు చెప్పిన వన్నియు సిప్పుడు నిజనేత్రములతో స్పష్ట ముగఁ జూడఁగలిగిరి.

చెట్టునం దెట్టిఫలములు ఫలించునో యనేకు లాచెట్టును జూచియే చెప్పఁగలరు. అట్లే మనుజుని శైశవకాలమును జూచి యనేకు లాతని భావిజీవిత మెటులుండునో దివ్యనేత్రములతోఁ జూడఁగలుగుచుందురు. ప్రిన్సు ద్వారకానాథుని యీనవజాత శిశువు భావికాలమునం దెట్లు పరిణమించునో యను విషయము నందఱు నొకవిధమున గ్రహించిరి. ఆవిషయమునే పరస్పరము మాటలాడుకొనుచు నానందించుచుండిరి.

శిశువుయొక్క యాకృతి సుందరమై యున్నటులఁ బ్రకృతి గూడ మధురముగను రమణీయముగను నుండెను. ఆనవవికసిత పుష్పమువంటి ముఖవర్చస్సునం దేదో యొక యపూర్వభావ ముదయించుచుండెడిది. ఒకసారి చూచిన, వా రెన్నఁడు నాము ఖము నిఁక మఱవఁజాలరు. అది యెంతయో యద్భుతమగు నాకర్షణశక్తిని గలిగియుండెడిది. ఒకసారి చూచినఁ దనివితీరక మరలమరలఁ జూడ నిచ్ఛగలుగుచుండును. ఆముఖ మొకసారి చూచినవా రాతని నెంతయో ప్రేమించెడివారు; పలుమాఱు పరుగిడియుఁ జూడ నిచ్ఛగించెడివారు. రోదన మన నెట్టిదో యూతఁ డెన్నఁడు నెఱుఁగఁడు. ఆనవమాధుర్యముతోఁ గూడిన

కోమలముఖమునం దెల్లపుడును జిఱునగవును, బ్రసన్నతయును దాండవమాడుచుండెడివి. జ్ఞానవృద్ధులగు మహర్షులు,తపస్వులు సాంసారిక విషయము లన్నిటియందు నాసక్తి విడిచి సర్వదా ప్రసన్నవదనులై, ప్రశాంతచేతస్కులై, వికసితముఖారవిందులై విరాజిల్లెడివారు. ఈ శిశువుగూడ సర్వదా సుఖముచే, సంతుష్టిచే, నానందముచే విరాజిల్లుచుండెను. ఎట్టిలోపముచే నైన శిశు వెన్నఁడు నొక్క ముహూర్తమేని విచారముతో నుండుట గాని, విషణ్ణవదనుఁడై యుండుట గాని కానరాదు. అందఱు నా ముఖమును దిలకించి చూచి యీ యద్భుత శిశు వెవరని యాశ్చర్య మొందుచుండిరి.

దినదినమును శుక్లపక్ష శశికళవలె నాశిశు వపూర్వమాధుర్యము వెల్లివిరియ నభివృద్ధిఁ జెందుచుండెను. అతఁడు పెరిఁగిన కొలఁది దైహికరూప లావణ్యములతోపా టాతని స్వభావ మాధుర్యమును జంద్రకళవలెనే వర్ధిల నారంభించెను. రామమోహనుఁ డా శిశువును జూచిచూచి విమోహితుఁడై పోవువాఁడు. శిశువుకూడ రామమోహనునివైపు మరలి తదేకదృష్టితోఁ జూచుచుండెడివాఁడు.

ఆయన శిశువుయొక్క దేహసౌష్ఠవము నతిసూక్ష్మముగ నవలోకించిన కొలఁది నధికోత్సాహము నానందమును బొందుచుండెను. ఆ భావము నతఁ డింక రహస్యముగ నుంపఁజాలకుండెను. ఆతని మనోభావము లాయన నేత్రములందును, ముఖము నం

మను దమంతనే ప్రకాశించుచుండెడిని. ఆయన యీ స్థితిని గాంచి లోకు లాశ్చర్యముతో తప్ప వాల్పక చూచుచుండెడి వారు. "ఆయన యీ క్షుద్రశిశువునందే యపూర్వ వస్తువును గాంచి యానందము నందుచున్నాఁడు? ఉత్సాహము నందుచున్నాఁడు? ఇంత మైమఱచి పోవుచున్నాఁ"డని తలంచెడివారు.

క్రమముగ నావిషయము వెల్లడి యయ్యెను. ప్రజ లత్యంతాశ్చర్యములఁ బొందిరి. తుదకొకనాఁడు వారాయనను దానికిఁ గారణ మడుగవలె ననెడు కౌతూహలము నాఁపుకొనలేకపోయిరి. అపుడు రామమోహనుఁ డిట్లు నుడివెను. "ఈ శిశువు సామాన్యశిశువు గాఁడు. ఈతఁ డపూర్వశక్తిసంపన్నుఁ డైన బాలకుఁడు, నాకుఁ దోడ్పడుటకును, నాయనంతరము నాకార్యమును సాధించుటకును భగవానుఁ డీతనిని బంపినాఁడు. నే నారంభించిన కార్యము నీబిడ్డ నెఱవేర్చును. ఈతనివలన దేశమునకును, సంఘమునకును మహాకళ్యాణము సమకూరును భవిష్యత్తునం దితఁడు నా స్థానమున కధికారి యగును. దేశమున కెల్లఁ బూజ్యుఁడును మాన్యపురుషుఁడు నగును. ఠాకూరు వంశమునందు మహాకీర్తిస్తంభమును స్థాపించును.

క్రమముగ బాలకుని నామకరణమునకు, నన్నప్రాశమునకు సమయ మేతెంచెను. మహోత్సవముతో నాకార్యములు నెఱవేఱెను. రామమోహనుని యిచ్ఛ ననుసరించియు జ్యోతిర్విదుల యభిమతము ననుసరించియు నా శిశువునకు దేవేంద్ర

నాథుఁడని నామకరణము చేయఁబడెను. అందఱు నాశాపూరి తాంతరంగములతో దేవేంద్రుని వైపు తమ వేయికన్నులను సారించి చూచుచు దినములు గడుపుచుండిరి. దేవేంద్రుఁడు నందఱియొక్క స్నేహమును, ప్రేమాదరములను, ఆశానందము లను బొంది యభివృద్ధిఁ బొందుచుండెను. క్రమముగా నాతనికి విద్యారంభముగూడఁ జేయఁబడెను.

శైశవమునం దెక్కువ గారాబము నందినయెడల బాలకు లనేకలు పాడగుట సహజమైయున్నది. విశేషముగ ధనికులబిడ్డ లత్యంతము గారాబమునఁ బెరిఁగి మిక్కిలి స్వేచ్ఛాచారులై యతిసుకుమారులై కరము దురభిమాను లగుచుందురు.

కాని మన దేవేంద్రున కివియన్నియు విపరీతములే. చాల శైశవమునుండియు నాతఁ డత్యంత శాంతచిత్తుఁడును, సదా పరిఫుల్లవదనుఁడు నై యుండెను. పెద్దవాఁడై యందఱివలనను సర్వదా విశేష గౌరవాదరములను బొందుచున్నను నాతని యీ పూర్వస్థితి కెట్టిమార్పును లేకుండెను. ప్రేమగౌరవముల తోడఁ బెరిఁగిన కొలఁదియు నతఁ డత్యంత శాంతస్వభావుఁడు, నత్యంత ప్రసన్నచిత్తుఁడు, నత్యంత స్థిరబుద్ధిసంపన్నుఁడును గాఁ జొచ్చెను. బాలకుని మనస్సునం దెట్టి కోరికలుగాని యాశలు గాని లేవు. ఎట్టి స్పృహయును లేదు. ఏద్దానియందు నసంతు ష్టియును లేదు. లభించినదానియందే పరమానందము.

దేవేంద్రనాథుఁ డేవస్తువును గాంచినను దాని నేకాగ్రచిత్తము

తోఁ జూచుచుండును. ఎద్దానిఁ జేయఁబూనిన దానియందే నిమగ్నుఁడై పోవుచుండును. అప్పు డాతని యాబాలహృదయమునుండి మంత్రిబలముచే నెవరో సమస్తచాపల్యమును చాంచల్యమును నివారించుచున్నటులఁ దోఁచుచుండును. బాలకుఁడయ్యు బాలకుల స్వాభావికధర్మములను వదలి జ్ఞానవృద్ధుఁడగు తపస్వివలెఁ బరవశుఁడై, స్థిరుఁడై, నిశ్చలుఁడై యుండెను. కాని యాతని యంతరంగమందుఁ బ్రవీణుని గాంభీర్య మేమాత్రమును గాన్పించెడిది కాదు. బాలకోచిత నిర్మలానందబింబమే వికసించెడిది. అప్పు డాపరమ సుందర లావణ్యమయ ముఖమండలమునం దొక యపూర్వమధురభావము తాండవించుచుండును. చూచినవా రెల్లరును దేవశిశు వని తలంచి యాయన వైపున కాశ్చర్యముతోఁ జూచుచుండెడివారు.

మన బాలదేవేంద్రుఁడు లోకమునందలి ప్రతి వస్తువునందు నేదో యొక యలౌకికామూల్యవిశేషమును దర్శించి యందు నిమగ్నుఁ డగుచుండును. పుష్పమును గాంచి భక్త్యానందములచేఁ బరవశమగు చిత్తమునందే నిమగ్నుఁ డయి చూచుచుండును. అటులనే సామాన్య మగు తృణాంకురమును జూచినను సుఖము, నానందము ననుభవించెడివాఁడు. వెలుతురునుజూచి పరవశుఁ డగునటులె యంధకారమును గాంచియు నమందానందము ననుభవించెడివాఁడు. మేఘములు, ఎండ, ఝంఝామారుతములు, వర్షము మొదలగు ప్రకృతియొక్క సకల నిత్యధర్మ

ములతో నాతని ప్రాణ మేకతంతువున బంధింపఁబడియుండెడిది. అన్నియు నాతని కింటివస్తువులే, అన్నియు నాయనకుఁ బ్రియములగు నాటవస్తువులే. ఏవస్తువు నైనను నాబాలకుఁ డసహ్యించుకొనుటగాని నిర్లక్ష్యముతో నుపేక్షించుటగాని లేదు. అట్లు సేయనుజాలఁడు.

క్రమముగా దేవేంద్రున కుపనయన మయ్యెను. బ్రాహ్మణోచిత నిత్యకర్మకలాపముల నన్నిటి నతఁ డనాయాసమున నేర్చుకొని నిర్వహించుచుండెను. కాని యాయాకర్మముల నన్నిటిని జేయునపుడు సామాన్యజనులవలె విధి యని చేసికొనపోవువాఁడు గాఁడు. ఎపుడే కార్యమును జేసినను మనఃప్రాణములను ధారపోసి మఱియుఁ జేసెడివాఁడు.

పూజయందుఁ గూర్చున్నపు డాయనకు బాహ్యజ్ఞానము లోపించెడిది. అటులే పూజలో నిమగ్నుఁడై పోయెడివాఁడు. అపు డెవ రెంత యఱచినను నాతఁడు గ్రహింపఁజాలకుండును. ఆయనయొద్దనుండి జవాబుపొందుట దుష్కరము. సహస్రవ్యాఘాతములచేత నైనను నాతని యాపూజకు నాటంకము గలిగింప నసాధ్యము. దేవతదిక్కుఁ జూచుచుండిన యెడ రెప్పయైనను వాల్చెడివాఁడు గాఁడు. ఆదేవతయందుఁ దన సమస్త మనఃప్రాణములను నిగిడ్చి, యందే తన్ను సంపూర్ణముగ నిమగ్నము గావించుకొని పరవశుఁడును దన్మయుఁడు నై యుండువాఁడు.

బాల్యకాలమునుండియు దేవేంద్రునిప్రకృతియం దిట్టి యత్యాశ్చర్యకరములగు గుణము లెల్ల వికసించుటకు మొదలిడెను.

కావుననే శైశవమునుండియు నాతఁడు పరిశుద్ధవర్తనుఁడును, గర్తవ్యప్రియుఁడును, న్యాయశీలుఁడును, నిరంతరము పరిశ్రమ సేయువాఁడును, మహాధార్మికుఁడును గాఁజొచ్చెను. ఇతరుల దుఃఖమును బాధను గాంచెనా, వానిని దేవేంద్రుఁడు తనవిగాఁ దలంచి విచారపడుచుండెడివాఁడు. సామాన్యపశుపక్షుల బాధను గాంచినను దాను విచారగ్రస్తుఁడై వానికొఱకుఁ దహతహలాడుచుఁ దన్నివారణార్థమై పరుగిడువాఁడు.

ఎవ్వరైన నెవ్వనినైనఁ దిరస్కరించినచో నాతనిని దన మృదుమధురవాక్కులతో నోదార్పఁ బరుగిడువాఁడు ఎవరెట్టి యాపదయందుఁ బడినను నాతని విమోచనమునకై తన యావచ్ఛక్తిని వినియోగింప వెనుకాఁడువాఁడు కాఁడు. ఎవరేని నిగాశచేఁ గుందుచున్నపుడు తన మధురవాక్కుల వినిపించి వారియం దాశాజ్యోతిని వెలిఁగించి వారి సకలదుఃఖములను దూరము చేయఁ బ్రియత్నించువాఁడు. ఆయనపై భగవానున యనంతకరుణ యుండుటచేతనే యతిబుద్ధిశాలు రగు పండితులు గూడఁ దాము దుఃఖములందు, నాపదలందు, ధైర్యమును గోలుపోయినప్పు డాబాలకుని రెం డోదార్పుమాటల వినినంతనే తమ సకల దుఃఖములను మఱచిపోయెడివారు. ఈవిధమున మన బాల దేవేంద్రనాథుఁడు చిన్నలకుఁ బెద్దలకు, జ్ఞానులకు నజ్ఞానులకు, ధనికులకు దరిద్రులకు నందఱినయనములకు మణిస్వరూపుఁడై ప్రకాశించుచుండెను.

బాల్యమునుండియు నే బాలకుఁడు తన స్వభావమునందును, చరిత్రయందు నిట్టి గుణగణములఁ గలిగియుండెనో యట్టి యాతఁడెపు డేది కోరిన నదియే నెఱవేఱుచుండును. కావున నట్టి బాలకుఁడు విద్యను గడించి యద్వితీయపాండిత్యమును బొందుటన్న నది యొక కఠినకార్యమా ? దేవేంద్రనాథుఁడు గూడ విద్యారంభమునుండియును మాతృబలముచేతనో యన్నటుల విద్యయం దాశ్చర్యకరమగు నౌన్నత్యమును బొంద నారంభించెను. ఆయని స్వభావచరిత్రలను, గార్యకలాపములను జూచిన వారెల్లరు రామమోహనుఁడు ప్రవచించిన ప్రతివచనము సత్యమగు ననియు, దేవేంద్రుఁడు మహాపురుషుఁ డగు ననియును దృఢముగ విశ్వసించిరి.

ఇంకఁ గొంచెము పెద్దపెరిఁగిన వెనుక దేవేంద్రుని రామమోహనరాయలు పాఠశాలయందుఁ బ్రవేశపెట్టిరి. అచ్చటఁ గొన్నాళ్లు చదివి యాతఁ డాశ్చర్యకరముగ విద్యను గడించెను. అనంతర మింకను నున్నతవిద్య నేర్పు నుద్దేశముతో నాయన తండ్రి యాతని పదునాలుగు వత్సరములవయస్సునందు హిందూ కాలేజియందుఁ బ్రవేశపెట్టెను.

# పంచమ ప్రకరణము

## స్వభావము

నేఁటికి హిందూకాలేజి యధికారుల పాపమునకుఁ బ్రాయశ్చిత్తము జరిగినది. ఏకారణమున నేవిద్వేషముచే వారు రామమోనుని హిందూకాలేజి సంబంధమునుండి దూరమున నుంచిరో యది యిప్పు డింకఁ గలుగఁబోదు. భగవానుఁడు మరల యీ యన్యాయకార్యమునకుఁ బగదీర్చుకొనెనో యనునటుల రామమోహనునికిఁ బరమభక్తుఁడును, బ్రియతమశిష్యుఁడు నగు దేవేంద్రు నాకాలేజికిఁ దెచ్చి యందుఁ బ్రవేశపెట్టెను.

ఇంతకుఁ బూర్వమే రామమోహనుఁడు స్వదేశమును విడిచి విదేశమునకుఁ జనియుండెను. సెలవు తీసికొనునపు డాయన తన ప్రాణాధికప్రియుఁ డగు దేవేంద్రనాథునిఁ గొంచెము దూరముగఁ బిలిచి యాతని చేయి పట్టుకొని రహస్యముగ నేవో కొన్నిమాటలు చెప్పి పోయెను. ఆమాటలిం కెవరును వినలేదు. ఇంక నెవరును గ్రహింపను లేదు. ఎవరికిఁ జెప్పఁబడెనో యాతఁడు మాత్రమే చీఁకటియందు దీపమునువలె, దిక్కులేని వాని దిక్కువలె దిగ్భ్రాంతుఁడగు పథికుఁ డుత్తరదిక్ప్రదర్శకధ్రువనక్షత్రమువలె, నాయమూల్యవాక్కుల మర్మమును దెలిసికొని సంపూర్ణముగఁ దన హృదయాంతరాళమున నానందము ననుభవించెను.

రామమోహనుని నిరంతరప్రశాంతగంభీరముఖమును జూచి నంతనే దేవేంద్రనాథుఁడు శైశవకాలమునుండియు నొక విధముగఁ బరవశుఁడై తన్మయుఁడై యుండువాఁడు. ఆయన యందుఁ దన సమస్తదేహమును, ప్రాణమును, మనస్సును, జీవమును, శక్తిని, సామర్థ్యమును, సర్వస్వమును, ధారవోసి, ఆయనయందే తన్నర్పించుకొని లయముచేసి వైచెడివాఁడు. అప్పు డేబాహ్యవస్తువునందును దనకు దృష్టి యుండెడిది కాదు. ఏమాటయు జ్ఞాపకముండెడిది కాదు. కేవలము నేకదృష్టితోఁదన్మయత్వమున నిమగ్నుఁడై యాయన ముఖమునే చూచుచుండెడివాఁడు. అపు డాతని జూచినయెడల నెవరో యొక మహాశక్తిశాలియగు శిల్పి యొక సుందర మగు రాతిబొమ్మను జేసి చమత్కార మగురంగును బూసి నిలువబెట్టెనా యని తోఁచుచుండును. కావున రామమోహనుఁడు దేవేంద్రున కేమిచెప్పి వెళ్లెనో యెవరును గ్రహింపఁ జాలనటుల నాతఁడును దానిని జ్ఞాపకమునం దుంచుకొనలేకపోయెను. కాని దానిఫలిత మతిత్వరితమున ఫలింప నారంభించెను. గారడివాఁడు మంత్రములచే నితరులను లోఁబఱుచుకొని తన్మూలమునఁ దన యిచ్ఛానుసారముగఁ గార్యములను నెఱవేర్చుకొను నటుల నీతని విషయమునను బరిణమించెను.

ఆ మాటలశక్తి మంత్రశక్తివలెనే దేవేంద్రునిపై వ్యాపింపఁ జొచ్చెను. అప్పటినుండియు నాతఁడు మిక్కిలి ధర్మపిపాసగల

వాఁడై తత్త్వానుసంధానమునుజేసి తిరుగుచుండెను. దేశమందంతటను బ్రాహ్మధర్మము వ్యాపించు టెట్లు? ఆధర్మ మన్నివిధముల నౌన్నత్యమును బొందు టెట్లు? కేవల మామహాధర్మమే సర్వశ్రేష్ఠ ధర్మమై లోకమునఁ దన ప్రభుత్వము నెట్లు విస్తరింపఁజేయఁగలదు? అను విషయముల నాలోచించుచుఁ దిరుగుచుండెను.

చిన్న యనక పెద్ద యనక యెవ్వనిఁ జూచిన నాతనికే యా విషయములను జెప్పుచుండెను. జ్ఞాని యనక, యజ్ఞాని యనక యెల్లరకును బ్రాహ్మధర్మమర్మమును దెలుపఁ బ్రయత్నించుచుండెను. ఎచ్చట నైన నొక పోరాటముగాని, గృహకల్లోలముగాని, యశాంతిగాని సంభవించినయెడల, వెంటనే పోయి దానియందు ధర్మాలోచనమును బ్రవేశపెట్టి యా సమస్యను బరిష్కరింపఁ బ్రాణముల నైన నొడ్డి ప్రయత్నముచేయువాఁడు. తన కెచ్చట నైన నసందర్భము కన్పట్టినను, నేదేని యర్థమును తాను స్వయముగఁ జక్కఁగ గ్రహింపలేకున్నను, దనయిష్టానుసారముగ నేదైనజరుగ కున్నను వానిని దెలిసికొనుటకై యా బ్రాహ్మసమాజమున నప్పటి యాచార్యు లగు పండిత రామచంద్రవిద్యావాగీశుగారి యొద్దకుఁ బరుగెత్తెడువాఁడు.

కిశోరవయస్కుఁ డగు దేవేంద్రనాథుని యిట్టి యద్భుత చరిత్రను గాంచియు నాతనికి ధర్మకాంక్షపైఁగల గాఢ శ్రద్ధాభక్తుల ననుభవించియు, తత్త్వజ్ఞానమును గ్రహించుటకై యాతఁడు వేయు నద్భుతము లగుప్రశ్నల నన్నింటిని వినియు

గొప్ప గొప్ప ధార్మిక పండితులుగూడ నిర్వ్యాజముగా వచ్చిరి. పెక్కుసారులు దేవేంద్రనాథుని యతికఠోర జటిలప్రశ్నల కర్థమును జెప్పుటకు వారుగూడఁ దడఁబడుచుండెడివారు. ధర్మసంబంధము లగు నత్యంతజటిల మీమాంసావిషయముల నెన్నింటినో వారు సూచించినంతనే దేవేంద్రుఁడు మిగుల సులభముగ గ్రహించెడివాఁడు. దానికి వా రాశ్చర్యమున మునిఁగి తేలుచుండిరి.

ఇంకను మహాశ్చర్యకరమైన విషయ మేమనఁగా నెచ్చటి వ్యాఖ్యానముగాని, మీమాంసగాని, తన మనస్సునకు సంతుష్టికరముగ నుండదో, యేది తన యభిప్రాయములతో నేకీభవింపదో, యా విషయములను గుఱించి యాయా పండితులతోఁ గడు చమత్కారముగఁ దర్కము చేయుచుండువాఁడు. ఎవరేవిధమునను, గప్పిపుచ్చుటకుఁగాని, తప్పించుకొనుటకుఁగాని వీలుండెడిదిగాదు. ఆ తర్కము నైన నత్యంతసూక్ష్మ సారయుక్త వాక్కులతో నారంభించువాఁడు. పండితు లా విషయమును వాచాలత యని త్రోసివేయుట కైనను వీ లుండెడిది కాదు. ఆతర్కమునకు సరళమగు మీమాంసకుదురువఱకు దేవేంద్రుఁడు పండితులను విడుచువాఁడుకాఁడు. తుదకా సకల తర్కములకును సులభమగు మీమాంస యేర్పడినపుడు తన యభిప్రాయములతో నేకీభవించినపుడు, పండితమండలిని దన యభిప్రాయములకు వశీభూతులనుగాఁ జేసికొని వదలువాఁడు. ఇట్టి యద్భుత

శక్తిని గాంచి వా రత్యంతము నాశ్చర్యపడి యీయద్భుతశక్తి సంపన్నుఁడు నద్భుతకర్ముఁడు నగుబాలకుఁ డెవ రని దేవేంద్రుని మొగమును దదేకదృష్టితోఁ జూచుచుండెడివారు. ఈ యద్భుత దృశ్యముల నన్నిటిని బ్రత్యక్షముగఁ గాంచి రామమోహనుఁ డింగ్లాండు వెళ్లువేళ నతిరహస్యముగాఁ జెప్పినది మ ఱేమియును గాదనియు, నాయన దేవేంద్రునకు సంజీవమంత్రవాద మొసఁగి తన స్థలమున నాతని నభిషిక్తునిగఁ జేసి తన సమస్తశక్తిని యధికారము నొసఁగె ననియు ననేకులు లోలోనఁ దలంచుటయేగాక పరస్పర మట్లు మాటాడుకొనుచుందురు.

అహోరాత్రము లెడతెగని గాఢపరిశ్రమముచే నిరంతరము నాచార్యోపదేశములను బొందెడు ననేక మహా మహోపాధ్యాయ పండితుల కేయే జ్ఞానము జన్మింపదో, సంసారములఁ ద్యజించి ఋషులును, తాపసులును, ఘోరతరతపంబు లాచరించియు, నే బ్రహ్మజ్ఞానమును బొందక నిరాశఁ జెందుచుందురో యట్టి బ్రహ్మజ్ఞానము, నట్టి దుర్లభజ్ఞానము నీయల్పవయస్కుఁడగు బాలకుఁ డెపు డెవరియొద్ద నేర్చుకొని పొంద నుపక్రమించుచున్నాఁడు? ఈమాట తలంచినవా రెల్లరు నాశ్చర్యపడుచుందురు. దేవేంద్రనాథుఁడు ప్రశ్నించు తత్త్వవిషయము లన్నియు నాతని మనస్సునం దెట్లుదయించునో యని తలంచియందఱు నా బాలకుని భక్తిశ్రద్ధలతోను, సన్మానముతోను, జూడ నారంభించిరి. ఆయన యుపదేశకుఁడు, నాచార్యుఁడును, నెంతటి మహాపురుషుఁడో గదా!

కాని యెవ్వరు నీవిషయమును గాఢముగ నాలోచించి చూడలేదు. దేవేంద్రనాథుఁ డేయాచార్యునొద్దనుండి జ్ఞానమును బొందుచున్నాఁడో! వ్రియత్నపూర్వకముగ నేకాగ్రచిత్తముతో, దృఢసంకల్పముతో, జ్ఞానమును బొంద దీక్షితుతైనయెడల నెవ్వరైన నెప్పుడైన దేవేంద్రునివలెఁ గాఁగల రనుటకెట్టి సందేహము లేదు. ఆ యాచార్యులు మ తెవ్వరును గారు!—స్వయముగఁ బ్రకృతిదేవియే, యీయనంత విస్తృత విశ్వక్షేత్రమే.

దేవేంద్రనాథుఁడు రాత్రివేళల ననంతనక్షత్రరాజితోఁ దేజరిల్లుచుండు వినీలాకాశమున దృష్టినిల్పి సంభ్రమాయత్తచిత్తముతోఁ దదేకదృష్టితోఁ జూచుచుండెడువాఁడు. వర్షాకాల నిబిడనీలమేఘమాలికలనుండి యప్పుడప్పు డందందు వెలి కుఱికి లోలోనదాఁగు సౌదామనీక్రీడల నవలోకించి పులకాంకిత గాత్రుఁడగుచుండెడువాఁడు. వాసంతపూర్ణిమానిశలందు నవవికసిత పుష్పములఁ గన్నులార విలోకించి విలోకించి, తన్మయత్వముఁ జెందుచుండెడువాఁడు. గంగాతీరమున శ్మశానక్షేత్రము మాఱుమ్రోఁగునటుల నెవరేని వైరాగ్యగీతములను బాడుచుండినయెడల నాతఁడు వెంటనే చెవియొగ్గి యాలకించుచుండెడువాఁడు. పుత్రవియోగము నొందిన జననియొక్కయు, భర్తవియోగము నొందిన భార్యయొక్కయు, హృదయవిదారకరోదనధ్వనులు కర్ణపుటములఁ బ్రవేశించినంతనే యవి యాతని ప్రాణమును దల్లడిల్లఁజేసెడివి.

ఈవిధముగఁ బ్రకృతియొక్క ప్రతి పరివర్తనమును బ్రతిదృశ్యమును, వాని వాని గభీరతల నడుగంటఁ గడముట్టఁ ద్రచ్చి చూచి యీబాలకుఁడు వానియం దాభగవానుని క్రియాకౌశలములఁ గాంచి యాయన నింకను నిగూఢముగ గ్రహింపఁ బ్రయత్నించుచుండువాఁడు. ఈప్రపంచమునందలి పరస్పరవివాదములు, యుద్ధములు, విప్లవములు, జయాపజయములు, కష్టసుఖములు, సంతోషవిచారములు, వీనియన్నిటియందును జొచ్చి యాయనంతాఖండ మహాపురుషుని లీలలఁ జూచుచున్నపు డాయన నింకను గ్రహించుట కత్యంత వ్యాకులత నొందెడివాఁడు.

ఉపనిషత్తులఁ జదువుచున్నపు డాయన యాసర్వభూతాతీత పరమాత్మను లోపల జాజ్వల్యమానునిగఁ గాంచుచుండెడివాఁడు. అపు డాయనను బట్టుకొనుటకై పిచ్చివానివలెఁ బరుగిడుచుండువాఁడు. కావున నొకప్పుడు పండితులయొద్ద నుపదేశముల నొందఁగోరుచుండును. ఇంకొకప్పుడు ధర్మశాస్త్రముల వ్యాఖ్యానములను వినఁగోరుచుండును, మఱొకప్పుడు తర్కమీమాంసలచేఁ దన మనస్సునకుఁ దృప్తి నొనగూర్చుకొనఁగోరుచుండును. ఇట్లు చేయుచుఁజేయుచు నేదోవిధమున నాపరమాత్మను బొందఁ గలుగుదు ననునదియే యాతని తలంపు; దృఢమైన యుద్దేశ్యము.

కావునఁ దనంతఁ దానుగ విశ్వప్రకృతి యీబాలకుని దన యొడి నిడికొని దినదినము ప్రవర్ధమానునిగఁ జేయుచున్నదో యాతని కుపదేశకుల యభావ మెచ్చటఁ దటస్థించును ? ఈవిధ

ముగ శైశవమునుండియు మన దేవేంద్రనాథుఁడు ప్రకృతిమహా గ్రంథమును బఠింప నేర్చికొని వయసుతోపాటు ప్రతిదినము నార్జించుచున్న జ్ఞాన మఖండ మైనది. అద్భుత మైనది. ఒక మానవాచార్యుఁ డాతని కింక నధికముగ నేమి నేర్పఁగలఁడు ?

అయిన నాతఁడు, తాను మిక్కిలి యజ్ఞుఁడ ననియు, నేమియు నెఱుఁగనివాఁడ ననియుఁ దలంచువాఁడు. రాత్రింబవళ్ళంధుని వలె నంధకారమునఁ దిరుగాడుచుండెడివాఁడు. కావున నందఱి నుండియు నేకొలఁదియో నేర్చుకొనుటకో, కొంత గ్రహించుటకో, కొంత తెలిసికొనుటకో ప్రయత్నముచేయువాఁడు. కావుననే యాతనికిఁ జిన్న పెద్ద, జ్ఞాని యజ్ఞాని, పండితుఁడు, మూర్ఖుఁడు, ధనికుఁడు దరిద్రుఁడు ననుభేదము లేకుండెను. తనకంటె నందఱను గొప్పవారినిగఁ జూచువాఁడు; శ్రేష్ఠు లని భావించువాఁడు. కావున నెల్లరకును నిర్విచారముగ నిస్సందేహముగ ధర్మవిషయమును తత్త్వవిషయమును జెప్పువాఁడు. అందఱి నుండియు నారి వారి యభిప్రాయముల నడిగి వానితోఁ దన యభిప్రాయములను సరిపోల్చి చూచుకొనుచుండువాఁడు. ఏకీభవింపక భేదము కన్పట్టినపుడు న్యాయతర్కములతోఁ బ్రకృత సత్యమును నిర్ధారణచేసి తన తప్పైయైనచో సరిచేసి దిద్దుకొనెడివాఁడు. ఇతరుల తప్పైయైనచో నది వారికిఁ దెల్పి సరిచేయువాఁడు.

ఏ బాలకుఁడు స్వాభావికముగా నహంకారము నాత్మాభిమానమును లేనివాఁడో, యే బాలఁకుఁడు స్వాభావికముగ సత్య

గ్రహణపారీణుఁడో, తత్త్వజిజ్ఞాసువో యాతని యభిప్రాయము పూర్ణమగుట కింక నాలస్యమేముండును? ఎన్నిదినములు పట్టును? స్వయముగ భగవానుఁడే సర్వదా యతనిలో నుండి తన సమస్త స్థితి నాతని హృదయమునందు జాజ్వల్యమానముగా వికసింపఁ జేయుచుండును. బాలకుఁ డయినను దేవేంద్రున కది యట్లే తట స్థించినది.

ఒకనాఁడు హఠాత్తుగ నుపనిషద్గ్రంథముయొక్క చింకికాగిత మొకటి యాతని కెక్కడనో దొరకెను. దానిని జదివి గ్రహించి నంతనే యాతని హృదయవీథియం దేదో యొక యపూర్వతేజ ముదయించెను. దానిలో నంత మధుర రసతరంగిణి యొకటి యొడ్డ నొరయుచుఁ దనంతనే ప్రవహించెను. దీనియందున్న విషయముల నన్నిటి నుచితముగ గ్రహింపఁగలిగినయెడల నేను వెదకులాడుచుండు మహావస్తువు దొరకఁగలదు.

ఇట్లు తలంచి, యాచింకికాగితము నపు డాదిబ్రాహ్మసమాజ మున కాచార్యులగు రామచంద్ర విద్యావాగీశులవారియొద్దకుఁ గొంపోయి "యీకాగితమునందుఁగల శ్లోకమునకు వ్యాఖ్యా నము, తాత్పర్యము, భావము నంతియు నాకు విశదముగఁ దెలుపుఁ"డని దేవేంద్రనాథుఁ డడిగెను.

ఆసందర్భమునం దాదినముననే యాతఁడు విద్యావాగీశుల వారియొద్ద 'బ్రహ్మవిద్య'ను గుఱించిన యుపదేశమును బొం దెను. నాఁటినుండియు దినదినమును గ్రమముగా సాధనకార్యము నందు నియతుఁ డయ్యెను.

# షష్ఠ ప్రకరణము

## తత్త్వబోధినీసభ

హిందూకాలేజియందుఁ బ్రవేశించి దేవేంద్రనాథుఁడు విద్యార్జనయం దఖండౌన్నత్యమును బొందఁజొచ్చెను. దానిఁ గాంచి యధ్యాపకు లందఱును మున్ముం దీయన మహాపండితుఁడై దేశమున కలంకారస్వరూపుఁడై యుండు నని తలంచిరి. కాని యాతఁడు భవిష్యత్కాలమునందు మహోత్తమాచార్యుఁడై వేదాంతధర్మముయొక్క మహోజ్జ్వలప్రభావముచే సమస్తభారతవర్షమును జాజ్వల్యమానముగను, గౌరవమయముగను జేసివేయునని హిందూకాలేజిస్థాపకు లేమాత్రము గ్రహింపఁ గలిగినను వారల వివేచనయందు ధర్మద్రోహియగు రామమోహనుని ప్రాణాధికప్రియశిష్యుఁ డాకాలేజియం దుండి విద్య నేర్చికొనుట యసాధ్యమే యయ్యెడిది.

ఎట్లయినను, హిందూకాలేజియందు దేవేంద్రుఁడు విద్యాభ్యాసముఁ జేయుచుండెను. శైశవమునుండియుఁ బ్రతికార్యమునందును మిక్కిలి తన్మయతను బొందు స్వభావముగల దేవేంద్రుఁడు విద్యార్జనయం దశ్రద్ధవహించు ననుమాట యసంభవము. విశేషముగ నాతఁడు ప్రపంచమునందలి ప్రతివిషయమునందును బ్రత్యేకముగ సంపూర్ణముగ నిమగ్నుఁడై దానియందుఁ దత్త్వజ్ఞానాన్వేషణమును జేయుచుండును. అట్లు సేయుచునున్నతవిద్య నారంభించినదిమొద లాతఁడు తన యభీష్టసిద్ధికై

యొక మహాసుందర ప్రశస్త రాజమార్గమును జూచినటు లాయెను. అపుడు మహోత్సాహముతోడను బటిష్ఠమును బ్రిబలమునగు పట్టుదలతోడను దా నామార్గమున నడువ నారంభించెను.

ఎంత చదివినను ఆయనకుఁ దనివితీరకున్నయది; తృప్తి లేకున్నయది. నూతనవిషయములను జదువుటకు, నూతనవిషయముల నెఱుంగుటకు, నూతనవిషయములలో జ్ఞాన మార్జించుటకును వ్యగ్రుఁ డగుచుండెను; ఆతురుఁ డగుచుండెను. ఆయన ఆతురత, ఉత్సాహము నంతకంతకు నెుండ్లై పోవుచుండెను. చదువునం దా టంకము గలిగినయెడల 'నీసమయమునం దింక నెంతయో ముందునకు వెళ్లువాఁడనుగదా! యింక నెన్నియో నూతనవిషయములను గ్రహించువాఁడనుగదా!' యని యాయన విచారముతో విలపించుచుండును. ఒక్కదినమందే సమస్తపుస్తకములను లెస్సగా నవగతము చేసికొనఁ గలిగినయెడల నూతనజీవితమును బొందఁగలుగుదును గదా యని యువ్విళ్లూరుచుండును.

ఇతర బాలకులు చదువుసంధ్యలయం దేమాత్రి మశ్రద్ధచేయుచున్నటులఁ జూచినను, వ్యర్థాలాపములతోఁ దమ కాలమును వ్యర్థపుచ్చుటఁ గాంచినను ఆతఁ డత్యంతము నావేదనముఁ బొందువాఁడు. అమూల్య మగు కాలమును వీ రెంత వృథగాఁ గడుపుచున్నదియును గ్రిహింపలేకున్నారు. ఈకాలమునందు వీ రెంతటి జ్ఞానమును సంపాదింపఁగలిగియుండెడివారో గదా! యని తలంచువాఁడు.

ఈవిధముగఁ గొన్నివత్సరములు హిందూకాలేజియందు విద్యాభ్యాసమొనర్చి యున్నతవిద్యయం దుత్తమజ్ఞానమును సంపాదించి కాలేజివిద్యను బూర్తి చేసినను ఆయన యేచదువు చదువుట కీప్రపంచమున కేతెంచెనో యాచదువు నెన్నాళ్లకుఁ బూర్తియగునో చెప్పఁజాలముగదా!

అధికారు లాసమయమున హిందూ కాలేజి విద్యార్థులకు సాధారణవిద్య నేర్పుట కెన్నియో ప్రయత్నములను జేయుచుండిరి; కాని, ధర్మవిద్యను గఱపుట కందు శతాంశ మైనను బ్రయత్నింపరైరి. ఆవిషయముసఁ బ్రయత్నము చేయమి యటుండ నేవిద్యార్థియైన నేధర్మచర్చ గాని, ధర్మసంబంధమగు నేసంభాషణలుగాని చేయుటఁ గాంచినచోఁ గోపగించెడివారు. ధర్మసంబంధమైన యెట్టిచర్చ గావించినను, ధార్మికములగు నెట్టి సంభాషణలుగాని, తర్కవితర్కములుగాని చేసినను హిందూసంఘమునందుఁ జిరకాలమునుండి ప్రచలితమైయున్న పురాతనరీతినీతుల నన్నిటినుండియు నేదో యొకదోషము బయల్పడఁ గలదు. ఆ కారణముచే నయ్యది యెవ్వరిమనస్సునైన నొప్పింపఁ గలదు. ఎవరిపై నైన వారి కశ్రద్ధ జనింపవచ్చును; అను నీభయముచేతఁ గాలేజివిద్యార్థు లెట్టిధర్మచర్చ గావించుటయు సంపూర్ణముగ నిషేధింపఁబడెను.

కాని దేవేంద్రనాథుఁ డది సహింపలేకపోయెను. అట్టి నీమముండుటచే నాతఁడు మనస్సునం దత్యంతము కష్టము ననుభ

వించుచుండును. ఆయన ధర్మచర్చ చేయుటకే ప్రపంచమున కేతెంచినాఁడు. శైశవమునుండియు నాతని హృదయమునం దాభావవాహిని ప్రబలతరముగఁ బ్రవహించుచున్నది. ఆతఁడు ధర్మచర్చను వదలి శాంతిని బొందఁగలఁడా? కాలేజివిద్యార్థులందఱు విద్యావంతులు. వీరలతో ధర్మచర్చ చేయఁగలిగినయెడల, వీరలతో నావిషయములను గుఱించి యాలోచించి సత్యతత్త్వములను బ్రకటింపఁ బ్రయత్నించినయెడల నది మిగుల సులభమగును. మఱి యధ్యాపకులతో నది యంతసులభమైన పని కాదు.

కాని యేమిచేసినను నేయుపాయము కాన్పించుట లేదు. కాలేజి యధికారులు మార్గమును సంపూర్ణముగ బంధించి వైచిరి. వారిమాటల ప్రకారము నడువకున్నచోఁ గంతవ్య మార్గమునుండి భ్రష్టత్వము కలుగును. దానివలన నధ్యాపకుల నవమానపఱచుట యగును. కావున నాతఁ డది యెంతమాత్రము చేయఁజాలఁడు. కనుక కాలేజీవిద్య పూర్తి కానఁ దవటకు ను కాలేజీని వీడి బయటకు రాసంతవఱకు నతికష్టముతో మౌన మవలంబించి, నిర్వివాదముగ నన్నియు నోర్చికొనెను.

అట్లనుటచే నాకాలమున వారిహృదయమునఁ గల స్వాభావికధర్మభావ మేమాత్రమును దగ్గి యుండలేదు. హృదయమునం దున్న ధర్మోత్తేజన మేమాత్రము నడుగునఁ బడిపోలేదు. కాలేజీయం దాయన హృదయభావముల నెంతగా నణఁచియుంచుకొని నను నవి యగ్నిపర్వతమునుండి వెడలు నగ్నిప్రవాహములవలె

దినదినము నత్యంతోజ్జ్వలముగను, నత్యంతతీవ్రముగను, నత్యంతోష్ణముగను, నత్యంతగౌరవముగను, వర్ధిల్లఁజొచ్చెను. ఏమాత్రపు దెబ్బ తగిలినను బయలువెడలి తమ యనివార్యప్రబలవేగముచే మార్గముఁ జేసికొని మహాప్రవాహమువలె వెల్లివిరిసి యొక్కదినముననే దేశ, గ్రామ, నగరముల నన్నిటిని ముంచివేసి పంచబంగాళము గావింప సంసిద్ధమై యుండెను.

ఆసమయమున హిందూకాలేజియందు పట్టభద్రులైన విద్యార్థియువకు లనేకులతోఁ గలసి మెలసి యాతఁడు మాటలాడినపుడు వారలయం దనేకులహృదయములలో మఱుఁగువడియుండి ధర్మాగ్నిప్రబలముగఁ బ్రజ్వరిల్లుచున్నటులును, మార్గము కనఁబడినంతనే యనేకు లామార్గమునఁ బరుగెత్తి సత్యధర్మముయొక్క సుశీతలచ్ఛాయక్రిందఁ గూర్చుండి మనఃప్రాణములను బల్లఁబఱుచుకొన సంసిద్ధులై యున్నటులును దేవేంద్రుఁడు గ్రహించెను. ఈవిషయములను దెలిసికొనుటచే నాయన మనస్సునం దాశయు, నానందము నొక్కమ్మడిగ నుదయించెను; కాని యాసమయమున వానిని దనభావమున నణఁచియుంచుకొనెను.

ఆకాలమున హిందూకాలేజీవిద్యార్థు లనేకు లేకమై యొక సభను స్థాపింపఁ బ్రయత్నించుచుండిరి.

ఆసభయందు విద్యాసంబంధములగు సమాలోచనములును, జ్ఞానాభివృద్ధికరములగు చర్చలును, బరస్పరసాహానుభూతిభావము నభివృద్ధిపఱుచుకొనుటకు దగిన ప్రయత్నములును, జేయు

చుండుట కుద్దేశింపఁబడినది. ఆసభయందుఁ గేవలము వైవిషయములను గుఱించి మాత్రమే యాలోచనములును ప్రయత్నములును చేయఁబడుచుండును. అంతియే గాని యచ్చట ధర్మ విషయమై యెవ్వరు నేమియు నాలోచింపఁగూడదు.

ఈనిబంధనములను దెలిసికొని విద్యార్థుల సముద్దేశమును గ్రహించి కలాశాలాధ్యాపకు లాసభను స్థాపించుకొన ననుమతి నొసంగిరి. ఆసభయం దెట్టిధర్మచర్చయు జరుగకుండునట్లు విశేషముగ నిషేధించి యుండిరి. యుక్తసమయమునం దానభ స్థాపిత మాయెను. దాదాపుగా రెండువందలమంది విద్యార్థు లాసభయందు సభ్యులుగఁ జేరిరి. మన దేవేంద్రుఁడుగూడ నా సభయం దొక ప్రధానసభ్యుఁ డయ్యెను. ఆసభకు "సాధారణ జ్ఞానోపార్జనీ" సభ యని నామకరణము చేయఁబడెను.

హిందూకాలేజీయందే యొకగదిలో నీసభ స్థాపింపఁబడెను. నియమానుసారముగ సభ సమావేశ మగుచుండెను. కాలేజి విద్యార్థులు వారివారి జ్ఞానము, శక్తి, సామర్థ్య మున్నగువాని ననుసరించి యాంగ్లమునను, వంగభాషయందు నుపన్యాసము లొసఁగుచుండిరి.

ఈవిధముగ నా "జ్ఞానోపార్జనీ" సభయందు విద్యార్థులచే విద్యాజ్ఞానాదులను గుఱించి పర్యాలోచనములు గావింపఁబడుచున్నను దేవేంద్రనాథుని మనస్సునకుఁ దృప్తి యేమియు లేకుండెను. కాలేజీవిద్యార్థు లందఱికిని గ్రంథపఠనముఁ గలిగెడు విద్య

మాత్రమే కలదు. లోకసంబంధ మగుజ్ఞానము వారి కెవరికిని లేదు. ఉన్నను, అది యత్యల్ప మైనదిగా నుండెను. కావున శైశవమునుండియు, నిత్యమును నూతన జ్ఞాన మార్జించుచున్న వాఁడును, నిత్యమును నూతన విద్యావిశేషములను, నవీనతత్త్వములను గ్రహింప నత్యంతప్రబలాసక్తి గలవాఁడు నగు మనదేవేంద్రుని మనస్సు దీనియం దెట్లు సంతుష్టిఁ జెందఁగలదు? ప్రకృతి యెవ్వనికి విజ్ఞానగురువో, విశ్వ మెవ్వనికి సువిశాల కర్మక్షేత్రమో, యట్టివాఁ డేకొంచెపాటి విద్యనో నేర్చుకొనుటచేతను, ఏ చిన్నవిషయములనో గ్రహించుటచేతను ఎట్లు సంతుష్టిఁ జెందియుండఁగలఁడు?

విశేషముగ నా 'జ్ఞానోపార్జనీ' సభయందు ధర్మచర్చ కెట్టి తావును లేదు. మనుజునకు యథార్థజ్ఞానము దేనివలనఁ గలుగునో యాస్థాన మీసభయం దసలే లేనపుడు, సదా ధర్మజ్ఞాన పిపాస గలదేవేంద్రుని హృదయ మెట్లు శాంతి నందఁగలదు?

దినదినమును, తత్సభాకార్యము లెంత నియమపూర్వకముగ నెఱవేర్పఁబడుచున్నను, సభ్యబృంద మెంతగ నట్టి గ్రంథపఠన జ్ఞానమును గుఱించి మరల మరల నాలోచించుచున్నను దేవేంద్రనాథునిహృదయ మత్యంత వ్యాకులతతోడను, నధైర్యముతోడను గ్రుంగిపోఁజొచ్చెను తుద కాయన మనస్సునకు నచ్చినటుల నొకసభను స్థాపింప సంకల్పించుకొనెను. దానియం దంతట నన్నివిధము లైన విషయములను జర్చించి యథార్థ మగు జ్ఞాన

మును బొందుట కానుకూల్యము గలుగు నని తలంచెను.

తుద కట్లే జరిగినది. హిందూకాలేజియందుఁ జదువు పూర్తి చేసి బయటకు వచ్చినపిమ్మట 1839 వ సంవత్సరమునఁ దమ జోరాసంకోగృహమునం దొక నిరుపహతిస్థలమునందుఁ గొందఱు సాధారణవ్యక్తులతో నొక సభను స్థాపించెను. ఈసభ పేరే "తత్త్వబోధినీ సభ."

ఈసభ స్థాపింపఁబడినపుడు విద్యావంతులయొక్కగాని, పట్టభద్రులయొక్కగాని, సాహాయ్యమును దేవేంద్రుఁడు పొంది యుండలేదు. కాని యంతటితో నిరాశపడక యాతఁ డాసభాభ్యున్నతి కై ప్రయత్నింప రేయింబవళ్లు తిరుగుచుండెను. ప్రతిమాసమునందును నియమానుసారముగ నీసభ సమావేశ మగుచుండెను. సమావేశమునకుఁ బూర్వమే విషయములు స్థిరపఱుపఁబడెడివి. సమావేశకాలములయం దానియమితవిషయములను గుఱించి యొక్కొకరుగాఁ దమ తమ వ్యాసములను జదివినతరువాత నందఱు నేకమై యావిషయములనుగుఱించి తర్కవితర్కములఁ గావించుచుండెడివారు. ఇతర విషయములనుగుఱించియు నాలోచనలను సల్పెడివారు.

ఈవిధముగాఁ 'తత్త్వబోధినీసభ' స్థాపింపఁబడినది. ఇదియే దేవేంద్రుని జీవితకాలమునందు జరిగిన యుత్తమకార్యములలో సర్వోత్తమ మైన కార్యము.

# సప్తమ ప్రకరణము

## సంసారము

ఉద్దేశము మంచిదై మహత్తరమైనయెడల నాకార్యమునందుఁ దొలుదొల్త నెన్ని బాధలు, కష్టములు, నంతరాయములు, సంభవించినను మంగళకరుఁడగు భగవానుని మంగళవిధానముచే నయ్యది తుదకుఁ దప్పక సఫల మగును. "తత్త్వబోధినీసభ" యే దానికిఁ బ్రత్యక్షప్రమాణము.

దేవేంద్రనాథుఁడు ప్రథమమునం దీసభను స్థాపించినపు డీ "తత్త్వబోధినీసభ" దేశమునకుఁ జాల హితకర మగు కార్యమొనర్చు ననిగాని, యిది యొకకాలమున నుత్తమ విద్యాధర్మజ్ఞానముల పర్యాలోచనకు సర్వశ్రేష్ఠస్థాన మై పూజింపఁబడునని కాని, యీదేశముయొక్కయు, సంఘముయొక్కయు నాయకులును, మహాపురుషులుగాఁ జిరకాలము ప్రజల భక్తివిశ్వాసములను బొంది యున్నవారును, బొందుచున్నవారును, ఈసభయందు సభ్యులయి దీనికిఁ బరమగౌరవమును బ్రసాదింతు రని కాని స్వప్నమందైనను గని యుండలేదు.

తుదకు వాస్తవముగ జరిగిన దదియే. దేవేంద్రనాథుఁడు ప్రథమమున సామాన్య వ్యక్తులు కొందఱితో నీసభ నారంభించినను బిమ్మట దేశచరిత్రయం దుజ్జ్వలస్వర్ణాక్షరములతో శాశ్వతముగ లిఖింపఁబడియున్న నామములుగల వారలలో ననేకులు మహాపురుషు లీసభయందు సభ్యులై యాతని యాయున్నతోద్యమమును బహూకరించిరి.

వర్ధమాన రాజ్యాధిపతియగు స్వర్గీయ మహతాబ్ చంద్ బహదూరుగారును, పూజనీయులైన విద్యాసాగర మహాశయులును, రాజేంద్రలాలమిత్రగారును, రామగోపాలఘోష్‌గారును శంభునాథపండితులును, నదియాయందు ప్రఖ్యాతి పొందిన శ్రీశచంద్రరాయిగారును మొదలగు దేశమాన్య దేశపూజ్య మహాత్ములందఱు నీ "తత్త్వబోధినీ" సభలో సభ్యులుగాఁ జేరి, దీని సదుద్దేశ్య సాఫల్యమునకును, దీని చిరతరోచ్ఛ్రియమునకు మిగుల వ్యయ ప్రయాసములఁ గోర్చి యెంతయుఁ గృషిసల్పిరి. దేశమునందింకెట్టిసభకును నేఁటివఱకిట్టి సౌభాగ్యము లభించి యుండలేదు.

ఇన్నాళ్లకు సుశీతలవాయువు వీచినది. క్రమక్రమముగ హిందూకాలేజీయందు విద్య నార్జించిన వ్యక్తులును "ఆదిబ్రాహ్మ సమాజము" యొక్క ప్రవీణులును, ధర్మజ్ఞులునైన సభ్యులును దేవేంద్రనాథుని విద్యాబుద్ధులయొక్కయు, ధర్మభావముయొక్కయుఁ బరిచయము నొక్కింతుక పొంది యిపుడాయనయెడల నత్యంతము శ్రద్ధాభక్తులు గలవారై యొక్కరొక్కరు నాయన ననుగతులైరి. ఈసుయోగము నీశ్వరప్రేరితమే యని యెంచి దేవేంద్రనాథుఁడా యున్నత విద్యార్థుల నెల్లరను బ్రాహ్మసమాజమునఁ జేర్చెను. దీనివలన నొకవైపున నాదిబ్రహ్మసమాజము, బలవత్తర మగుటయేకాక, మఱియొకవైపున దేవేంద్రనాథుని భవిష్యత్కర్మక్షేత్రముగూడ విస్తృత మయ్యెను.

అప్పటికిని దేవేంద్రనాథుఁడు యువకుఁడే; అతని వయస్సిరువదియైదువత్సరములు మాత్రమే. ఆవయస్సునందాతఁడు చేయఁగలిగినది యనేకులు నిపుణులుఁగూడఁ బ్రబలప్రయత్నములు గావించియు నెఱవేర్పఁగలరో లేరో సందేహమే. అట్లని యిన్నాళ్లును దేవేంద్రనాథుఁ డితరకార్యముల నన్నిటిని వదలి కేవలమును జ్ఞానధర్మచర్చలనే చేయుచుఁ గూర్చుండుట లేదు.

భగవానుఁడు తన్నీప్రపంచమునకు సంసారిగ నంపినపుడా సంసారమును వదలి వనముల కేఁగి తాపసధర్మము నవలంబించిన యెడల ధర్మమును వీడి యధర్మము నవలంబించినటు లగు నని యాతఁడు గ్రహించినవాఁడు. ఈ సంసారధర్మమును బూర్తిగఁ బాలించి దీనివలననే తగినమార్గము నేర్పఱచుకొని పరమాత్మను జేరవలసియున్నది. కావున నాతఁ డట్లే సంసారమునందలి సహస్రసంఖ్యాకములగు కఠోరకర్తవ్యముల నన్నిటిని బూర్ణముగ నెఱవేర్ప నేర్చుకొనెను. మఱియు, సర్వవిధముల సంసారముచేఁ బరివేష్టింపఁబడి యుండియుఁ బ్రకృతధర్మమార్గమునం దెట్లు నడచిన భగవానుని జేరనగునో దాని నందఱి సముఖమున నుజ్జ్వలదృష్టాంతములతోఁ జూపి యుండిరి.

దేవేంద్రనాథుఁడు మహాపురుషుని సంతానము. కావున నాతఁడు సంసారమును వీడి ధర్మాచరణమునకుఁ బోవ నుపాయము లేకుండెను. ఆయన కనేక కార్యములు! లోకమున నలువైపుల నుండి కార్యక్షేత్ర మాయన నాహ్వానించుచుండెను. ఆయన

వానిని వదలి యధర్మ మాచరింప నొల్లఁడు గాన సకల కార్య ములయందును దృష్టినుంచి యతఁడు తన మార్గమున నడువ వలసివచ్చెను.

దేవేంద్రనాథుఁ డిన్నాళ్లును విద్యార్జనతోపాటు సాంసారిక సామాన్యకార్యములు మొదలుకొని వారి విశాలమగు జమీం దారీకార్యములవఱకు నన్నిటిని యుక్తముగా నిర్వహింప నేర్చు కొనుచుండెను. ఇన్నాళ్లు నీవిషయము లన్నియు నేర్చుకొన నావ శ్యకత లేకుండెను. కాని యన్నివెపులనుండియు నిత్యమును నూత నవిద్యను, జ్ఞానమును బొందుటకే యాతఁ డత్యంతము నభిలషిం చుచుండును. అది యాతనికి వినోదము. కావునఁ దన యిష్టాను సారముగనే సాంసారికకార్యముల నన్నిటిని, జమీందారీవ్యవహా రముల నన్నిటిని నేర్చుకొని వానియందుఁ బ్రావీణ్యమును సం పాదించెను.

అప్పు డాతని యిరువదియైదవయేఁట నతని తండ్రియగు, ప్రిన్సు ద్వారకానాథుఁడు రాజకార్యములను బరిత్యజించి స్వతం త్రముగ వాణిజ్యమును జేయ నారంభించెను. ఆయన " కార్ ఠాకూర్ అండు కో" యను పేర నొక కార్యాలయమును నెల కొలిపెను.

దేవేంద్రనాథుఁడు విద్యార్జనతోపాటుగా నిన్నాళ్లును సాంసా రికకార్యములను, జమీందారీ కార్యములను నేర్చుకొని యుం డెను గాన నిపుడు తండ్రిగారి కార్యాలయమునకరిగి నియమాను

సారముగఁ గార్యాలయముయొక్కయు, వాణిజ్యముయొక్క యు సమస్త కార్యములను నేర్చుకొన నారంభించెను. చూచుచుండఁగనే యత్యల్పకాలమందే యాయన యన్నివిధములైన కార్యములందు నుత్తమజ్ఞానమును సంపాదించి తండ్రికిఁ దగిన పుత్రుఁడాయెను.

అయినను వీని యన్నిటియందును శ్రద్ధవహించి నేర్చుకొనునప్పుడుకూడ నాతఁడు పరమార్థజ్ఞానధర్మపరిశీలనమునుండి విరతుఁడు కాలేదు. దేవేంద్రనాథుఁ డీయల్పవయస్సునందే యిట్టి సర్వతోముఖమైన జ్ఞానము నార్జించుటఁ జూచి యాతని యద్భుత శక్తికి నివ్వెఱపడి యనేకు లతని ననేకవిధముల నభినుతించుచుండిరి.

దేవేంద్రనాథుని తండ్రియు, మఱి యితర గురుజనులు నాతఁ డిపు డనాయాసముగ సకలకార్యములను స్వయముగ నిర్వహించుకొనఁగలఁ డని గ్రహింపఁగలిగిరి. కావున నాతని భవిష్యత్ స్థితిని గుఱించినచింత వారలను గలవరపెట్టలేదు. ఇపు డేనిమిషమునం దైనను యోగ్యమగు పుత్రునిహస్తమున సంసార సంబంధమగు సమస్తభారము నునిచి తాను నిశ్చింతిగా నుండనచ్చు నని తలంచి ద్వారకానాథుఁ డానందించుచుండెను.

ఇఁక దేవేంద్రనాథుఁడు సంసారసంబంధ మగుసకలకార్యములను నేర్చుకొన్నను బూర్ణముగఁ దాను సంసారి యగుటకు సంసిద్ధుఁడై యున్నను లోకమునందలి యెద్దానియందును దగులు

వడి మునిఁగిపోలేదు. నూనెపై నీటిబొట్టు తేలుచుండును కాని నూనెతోఁ గలిసిపోఁజాలదు. ఆయనయు నట్లే సంసారధర్మము యొక్క సకలవిషయ వ్యాపారములందును సంబంధము గలిగి యుండియు దేనితోడ నేకమైపోలేదు. ఏదియుఁ దనయం దత్యా సక్తిని గలిగించి యాతనిఁ జుట్టివేచి తనకు లోఁబఱుచుకొనలే కుండెను. తన స్వభావసిద్ధ మగుధర్మబలముచే బలవంతుఁ డై యెంతటి జటిలవిషయజాలముచేతఁ జుట్టఁబడినను నాతఁడు సం పూర్ణ నిర్లిప్త భావమునఁ దన దేశముయొక్కయు, సంఘముయొ క్కయుఁ, బ్రజలయొక్కయు సేవాకార్యమును జేయ మొదలి డెను. భవిష్యత్కాలమున నా యాసక్తిరహితుఁ డగు మహాపు రుషుఁ డీలోకమున కొక మహాదర్శప్రాయుఁ డగు నని యాతని యావనమందే యాయా సూచనలవలన లోకులు గ్రహింపఁ గలిగిరి.

## అష్టమ ప్రకరణము.

### కర్మక్షేత్రము.

ఇంతలో దేశమునందుఁ గొన్ని యాంగ్లవిద్యాలయములును, గళాశాలలును, వైద్యకళాశాలలును వెలసెను. గ్రామగ్రామము నను బ్రభుత్వపాఠశాలలు నెలకొల్పఁబడెను. కావున నింక విద్య నేర్చుకొనుట కిబ్బందు లేవియు లేకుండెను. కాని యిన్నాళ్లును స్వధర్మవిహీన మగువిద్యయే వ్యాపించుచుండెను. దాని ఫలిత

మును గాంచి దేశీయులు భావికాలమునస్థితిని గుఱించి మిక్కిలి విచారించుచుండిరి.

ఇప్పుడు బాధయును దూరముచేసి దేశమున విద్యావ్యాప్తితో పాటు స్వధర్మాసక్తియు వ్యాపింపఁజేయ దేవేంద్రనాథుఁడు విశేషప్రయత్నము చేయ నారంభించెను. తత్త్వబోధినీసభవారిచేఁ గలకత్తాయం దొక నూతనవిద్యాలయమును స్థాపింపఁజేసెను ఈ విద్యాలయము పేరు తత్త్వబోధినీపాఠశాల.

ఈ తత్త్వబోధినీ పాఠశాలయం దుపనిషత్తులును, మఱియు నితర శాస్త్రములును, వానితో పాటు స్వధర్మవిద్యయు నేర్పఁబడుచుండెడివి. ఇందు విద్యనేర్పు పద్ధతులును పఠనీయ పుస్తకములు నన్నియు నితరపాఠశాలలోనివానికంటె భిన్నములైనవి. ఇన్నాళ్ళనుండియు నీదేశమునందలి పాఠశాలలలోఁ జదివింపఁబడుచున్న పుస్తకము లాంగ్లేయులచే వ్రాయఁబడినవో లేక యనువదింపఁబడినవో యై యున్నవి. స్వదేశగ్రంథకర్తలు వ్రాసిన పుస్తకము లొకటి రెండుమాత్రమే యుండెడివి. అవియైనను ఆంగ్లేయుల మార్గముల ననుసరించి వ్రాయఁబడినవే. వారి భాష మిగులఁ గఠినమైనది. భావము మిక్కిలి దుర్బోధమైనది. విద్యార్థులకుఁ జాలఁ గఠినముగా నుండెడిది. దేవేంద్రనాథుఁడు ప్రప్రథమమున దీనిపై దృష్టినుంచి దీనికిఁ బ్రతికార్యము సేయ నారంభించెను. ఆయన తత్త్వబోధినీసభవారి సాహాయ్యముతో సువిఖ్యాతపండితుఁ లగు నక్షయకుమారదత్తు మొదలగువారిచేఁ

బు స్తకములను వ్రాయించి యాపు స్తకములను తత్త్వబోధినీపాఠశాలయందుఁ బాఠ్యపు స్తకములుగా నుంపించెను. ఆమహాకార్యముయొక్క సత్ఫలితముగా నేఁడు మన వంగసాహిత్య మింతటి యౌన్నత్యమునుజెంది మనదేశమునందిందఱు సాహిత్యవిశారదులును, గ్రంథకర్తలును బయలుదేఱఁ గలిగిరి.

దేశమునందెల్ల వంగభాష మిక్కిలి యభివృద్ధి నొందఁగలదో, వంగీయు లెల్లు సరళముగను, సుందరముగను వంగమును నేర్చుకొని మాతృభాషయొక్క గౌరవమును నిలుపఁ గలరో వంగసాహిత్య మెట్లున్నతినిజెంది నిలువఁగలదో దేవేంద్రనాథుఁడెల్లపుడును వాని నుపాయములను జింతింపఁదొడఁగెను. తత్ఫలితముగాఁ దత్త్వబోధినీసభనుండి తత్త్వబోధినీపత్రిక యను నామముతోఁ బ్రసిద్ధమగున నొకమాసపత్రిక ప్రచురింపనారంభింపఁబడెను. ఈ తత్త్వబోధినీపత్రిక నేఁటివఱకును నిరంతరాయముగ వెలువడుచున్నయది.

నేఁడు వంగభాషయందు మాసపత్రికలకు లోటులేదు. కాని యీతత్త్వబోధినీపత్రికయే వానికెల్ల మార్గప్రదర్శకమైన సర్వోత్కృష్టమగు మాసపత్రిక. వంగభాషయు, వంగసాహిత్యమును దేశమున నేఁ డింతటి యున్నతస్థితిని బొందుటకు మూలకారణము దేవేంద్రనాథుని యీ తత్త్వబోధినీ పత్రికయే.

తత్త్వబోధినీపత్రికయందు సరళశుద్ధసాధువంగభాషలో ధర్మశాస్త్రములును, తత్త్వజ్ఞానమును, సాహిత్యమును, ఇతిహాసము

లును, భూగోళమును మొదలగు విషయము లన్నియుఁ జర్చింపఁ బడుచుండెను. దీనిని జదివి దేశములోని విద్యావంతు లందఱును విమోహితు లైరి. దీనియందలి భాషానైపుణ్యము, భావగాంభీర్యము, రచనావిషయము, చమత్కారము, గౌరవము, వానివలనఁ గలుగునుపకారము నందఱును గ్రహించిరి. మనుజుని జీవితమునందు ధర్మవిద్య నభివృద్ధి పఱచుటకును, దేశమును గౌరవార్హముగా నొనర్చుటకును సంఘమును నియమబద్ధముగా నుంచుటకు నిట్టి పత్రికాప్రచార మత్యంతము నావశ్యకమని యందఱును గ్రహింపఁగలిగిరి. దానితోపాటు దేవేంద్రనాథుని మహోన్నతోదార హృదయముయొక్క సదుద్దేశమునుగూడ నందఱును గ్రహింపఁగలిగిరి. అపు డాయన యెడ నెవరికి నెట్టి యశ్రద్ధయు లేకుండెను. ఏవ్యక్తులు ప్రథమమునఁ దత్త్వప్రబోధినీ సభయన్న నపహసించెడివారో, విరక్తిఁ జెందెడివారో వా రందఱు నిపు డొక్కరొకరే వచ్చి స్వేచ్ఛగా సభయందుఁ జేరి తత్త్వబోధినికి సభ్యులైరి.

దేవేంద్రనాథుఁ డీతత్త్వబోధినీ సభను, బత్రికను మిగులఁ జమత్కారముగ నడుపుచుండెను. దీనివలన దేశమున కనేకవిధముల నుపకారము చేకూరుచుండెను.

"తత్త్వబోధినీపత్రిక" వేదవేదాంతములు మొదలుకొని సకల హిందూధర్మశాస్త్ర విషయముల మర్మములను బ్రచారము గావించి సనాతన హిందూధర్మమును సంరక్షించి, గౌరవ

పలుచుచుండెను. క్రైస్తవ మిషనరీల యాక్రమణమును నివారించి దేశమునందు స్వధర్మమును, సంఘమును రక్షించెను విద్యాశాఖాధికారులయొక్కయు, శిక్షాప్రణాళికల యొక్కయు దోషములను జూపి సద్విద్యావ్యాప్తికి నలయు మార్గములను వెల్లడించెను. హిందూసంఘమునందలి నాయకుల దోషములను, దుర్బలత్వమునుజూపి సంఘమునందలి యనేకానర్థములను దొలఁగింప విశేషప్రయత్న మొనర్చెను. ప్రజలను బీడించు జమీందారుల యొత్తిడినుండి దుర్బలులైన ప్రజలను రక్షించుటకును, పన్నులభారమునుండి దేశమునం దున్న దీనులగు దరిద్రులను రక్షించుటకును విశేషప్రయత్నములు చేయ నారంభించెను.

కావునఁ దత్త్వబోధినీ పత్త్రిక, యిట్లు దేశీయులకు సేవ చేయుచుండెను. ఈవిధముగ దేవేంద్రనాథుఁడు తత్త్వబోధినీ సభను స్థాపించి యహర్నిశమును మిగుల గాఢపరిశ్రమము గావించి స్థిరప్రయత్నముల నొనర్చి దేశమునకు మహోపకారమును జేయ మొదలిడెను. ఇతరులు వందలకొలఁది నేకీభవించియు, నాయన చేసినదానియందు శతాంశ మయినను జేయఁగలరో లేరో సందేహమే.

కాని దీనితోడను దేవేంద్రనాథుఁడు సంతుష్టిఁ జెందలేదు. ఆకాలమునం దిప్పటివలె నన్నివిధములయిన పుస్తకములు నీ దేశమునం దింత సులభముగ దొరకుచుండెడివికావు. కావునఁ జదువుకొనుటకును, జ్ఞానోపార్జన మొనర్చుకొనుటకు నెంత గాఢే

చ్ఛయున్నను దృష్టికర మగుపుస్తక మొకటియుఁ గాన్పించెడిది కాదు. కావున నాతఁడు నిరాశఁజెంది యా కోరికను విడనాడ వలసి యుండెడిది. దేవేంద్రనాథుఁడు దేశవాసులకుఁ గల యీ లోపమును గ్రహించెను. దానిని నివారించుటకుఁ దత్త్వబోధినీ సభ వారిచే నొక గ్రంథసభను, పుస్తకాలయమునుగూడ స్థాపింపఁ జేసెను

ఈ గ్రంథసభ యం దేషియాటిక్ సొసైటీ కనురూపములగు కార్యములు జరుగుచుండెను. ఇంతకుఁ బూర్వమునుండియు నా సభయొక్క ప్రయత్నములచేతఁ గేవలమును సర్వవిధములయిన శాస్త్రగ్రంథములు మాత్రమే సమకూర్పఁబడుచుండెను. ఇప్పు డన్ని వైపులనుండియు నన్నివిధము లయిన గ్రంథములును సంగ్రహింపఁబడుచుండెను. ప్రాచీన హస్తలిఖితపుస్తకములు గూడ సేకరింపఁబడుచుండెను. ఈ గ్రంథసభ మిక్కిలి దుర్లభపుస్తకముల నన్నిటిని బహువ్యయప్రయాసముల కోర్చి సంగ్రహించి ప్రచురించుటకుఁగూడ నారంభించెను. ఈవిధముగాఁ దత్త్వబోధినీ గ్రంథసభచే స్థాపింపఁబడిన పెద్ద (లైబ్రేరీ) గ్రంథాలయము వలన దేశమునకు మహోపకార మొనగూడుటయు నొనగూడు చుండుటయు నందఱును గ్రహింపఁగలిగిరి. ఆపుస్తకాలయమిప్పు 'డాదిబ్రాహ్మ సమాజ పుస్తకాలయ' మని పే రొందియున్నది. దానియందు సమకూర్పఁబడిన యతిప్రాచీనగ్రంథములు దేశము నం దింకెక్కడను గానరావు. కాని యింకను దేశీయుల మన

స్సులనుండి క్రైస్తవధర్మమును, పాదరీల ప్రభావమును సంపూర్ణముగ దూరముగానట్లు దెలిసికొని దేవేంద్రనాథుఁడు దీనికిఁ గారణమును వెదక నారంభించెను. పాదరీ లీ దేశమునకు వచ్చి గొప్ప గొప్ప విద్యాలయములను స్థాపించి దేశీయుల మనస్సులను లోఁబఱుచుకొనిరి. అనంతరము తమపై జనులకు భక్తి విశ్వాసము లభివృద్ధియగుకొలఁదిని తమ యుద్దేశములు నెఱవేఱఁగల వని వారు తలంచుచుండిరి. ఈ విషయము నాతఁడు బహు ప్రయత్నముల చేతను, బరిశ్రమముల చేతను, వివిధస్థానములలోని వివిధము లైన ప్రసంగముల చేతను గ్రహింపఁగలిగెను.

దేశమునందలి కొందఱు ధనికులను, బండితులను సమావేశపఱిచి, వారి తోడ్పాటువలన మిషనరీలవలె బడులను గళాశాలలను స్థాపింపఁగలిగినచో దేశవాసు లిఁక పాదరీలపక్షమునఁ జేరరని దేవేంద్రుఁడు తలంచెను. ఈయుద్దేశముతోఁ బ్రతి పెద్ద మనుష్యునింటికిని బోయి మన దేశవాసులచే నెట్టులైన నొక్క మహా విద్యాలయ మయినను స్థాపింపఁబడవలె ననియు, దానివలననే దేశమునకు మహోపకారము చేకూరఁగలదనియు నందఱకును నచ్చునట్లు బోధించుచుండెను.

దేవేంద్రుని యీ మహాప్రబల ప్రయత్నమునకు ఫలితముగాఁ గలకత్తాయందలి 'సిమ్లా' భవనమున నొక సభ యేర్పాటు చేయఁబడెను. ఈసభయందుఁ బట్టణవాసులలోని చిన్నలును పెద్దలును, ధనికులును, బీదలును, పండితులును, పామరులును,

పెక్కుమంది సమావేశమయిరి. వారందఱు నేకీభవించి 1845వ సంవత్సరమున నొక యున్నత విద్యాలయమును స్థాపించిరి. దీని పేరు "హిందూహితార్థి విద్యాలయము." ఈహిందూహితార్థి విద్యాలయమును స్థాపించినవెంటనే దానికి నలుబదివేల రూపాయల మూలధన మేర్పడెను. దీనికి నెలకు వేయిరూప్యములు వ్యయమగుచుండెను. సుప్రసిద్ధుఁడును, కర్మవీరుఁడును మహాపండితుఁడును నైన భూదేవముఖోపాధ్యాయుఁడు దీని కధ్యక్షుఁడుగా నెన్నుకొనఁబడెను.

ఆసమయమున దేవేంద్రనాథుని హృదయాంతరాళమునం దొక ప్రబలవిషాదజలధర మలముకొనెను. ఆయన తండ్రిగారగు ప్రిన్సు ద్వారకానాథఠాకూరుగారు రెండుసారు లింగ్లాండునకు వెళ్ళిరి. 1842 వ సంవత్సరమున మొట్టమొదట వెళ్ళినపుడు స్వర్గీయ మహారాణీ విక్టోరియా సపరివారముగ నాతనికి యథోచిత సత్కారము గావించి యాదరించెను.

మహామాన్యు లగు రోమకమతాచార్యుఁడు, ప్రషియా ప్రిన్సు, ఫ్రాన్సు బెల్జియముల ప్రభుత్వములు నాతని కనేక విధముల గౌరవాతిథ్యముల నొసఁగి సత్కరించి యుండిరి. ఇది ఠాకూరువంశమున కెంతగౌరవప్రదమో సకల స్వదేశీయులకు నంత గౌరవప్రదమే.

ప్రిన్సు ద్వారకానాథుఁడు 1845వ సంవత్సరమున 'హిందూహితార్థి' విద్యాలయ స్థాపనమును జూచి రెండవమా ఱింగ్లాం

డునకుఁ బోయెను. ఆయన జీవయాత్ర యచ్చటనే ముగిసెను. రెండవసారి యింగ్లాండునకు వెళ్ళినవెనుక 1846 వ సంవత్సరము ఆగష్టు 1వ తేదీని యాతని 51వ వత్సర వయస్సున నతఁ డచ్చటనే తన దేహలీలలను త్యజించెను. పరమబాంధవుఁ డగు రామమోహనరాయ లేదేశమునందలి మృత్తికయందుఁ దన యంత్యస్మృతి నునిచియుండెనో యాతఁడు నా ప్రేమబంధమును ద్రెంచుకొనలేక కాఁబోలు నచ్చోటనే మృతిఁజెందెను.

దేవేంద్రనాథుఁడు బాల్యమునుండియుఁ బ్రకృతి సౌందర్య వీథీవిహారములు సలుపఁ గాంక్షించుచుండువాఁడు. మఱియు విశేషించి నౌకపై నెక్కి జలధిగర్భమునందలి యుత్తుంగతరంగమాలికాడోలికల నూయెల లూఁగుచుఁ గ్రీడావినోదముల వినోదింప నెంతయు నువ్విళ్ళూరుచుండెడివాఁడు. ఇట్టి వినోద విహార సమయముననే యాతఁడు తనవిశాలకర్మక్షేత్రముయొక్క కార్యజాల ప్రణాళికను లెస్సగ నేర్పఱచుకొనఁదగు చిత్తశాంతిని,మానసిక బలమును, సాధనోపాయములను సమకూర్చుకొనువాఁడు. పితృవియోగ విచారవర్తమానము వినవచ్చినపుడు నా విధముననే నౌకావిహారము సలుపుచుఁ దన జీవిత భావి కర్తవ్యముల నన్నిటిని నియమించుకొనుచుండును. హఠాత్తుగా నీవార్త యాతని చెవిని బడినంతనే యాయనపైఁ బిడుగుపడినట్లాయెను. ఆయనయే తనతండ్రికి జ్యేష్ఠపుత్రుఁడు; తండ్రి యనంతరము సంసారభార మంతయు నాయన తలపైఁ బడెను. కాని యా

నిష్కామ కర్మవీరుఁ డేమాత్రమును భీతిఁ జెందలేదు. మహా సంయమివలె, మునివలె,ఋషివలె నప్పటినుండియుఁ దన విశాల కర్మక్షేత్రమున యథార్థముగఁ బ్రవేశించి భారము లన్నిటిని దన తలపై వేసికొనెను.

అప్పటినుండియు నాతఁ డెన్నివిధములగు విషయవ్యాపార ములయందును గర్మప్రవాహములయందును మునుఁగుచుఁ దేలు చుండెనో యావిషయ మాలోచించినచో మన మాశ్చర్యాన్వి తులము గావలసినదే. ఒక వైపున విపులమగు జమీందారీ వ్యవ హారములు,ఇంకొక వైపున విశాలమగు ధర్మరాజ్యశాసనములు, మఱొక వైపున నూతన సంసారప్రవేశము, వేఱొక వైపున క్రొత్తసంసారపు టేర్పాటులు, ఇంకొక దిక్కున కఠినతరవ్యా పారవిషయములు, (కార్యాగారము, వాణిజ్యము మొదలగు నవి.) ఒకదిక్కున దేశసేవ, ప్రజల కనేక విషయముల నున్న తిని నమకూర్చుట. ఆయన కిఁక నొక్క నిమిషమైన నూపి రాడకుండెను.

అయినను ధర్మవీరుఁడును, గర్మవీరుఁడు నగు దేవేంద్రనా థుఁడు తన లక్ష్యమునుండి భ్రంశము నొందలేదు. అన్ని వైపుల నన్నివిషయముల నెల్లపుడును సామంజస్యమును సమకూర్చు చుఁ గఠోరపరిశ్రమచేతను, ప్రాణసంశయకర సాధనములచేతను సంపూర్ణ నిష్కామ భావముతో స్థిరలక్ష్యముగలవాఁ డయి తన గంతవ్యమార్గమున దినదినమును ముందునకుఁబోవుచుఁ బ్రపంచమునం దుజ్జ్వలధర్మమును నెలకొల్పెను.

## నవమ ప్రకరణము.

### సాధన.

స్వర్గస్థుఁడైన ద్వారకానాథుఁడు తా నెంతటి యుదారచేత స్కుఁడో యంతటి దానశీలుఁడుకూడ నై యుండెను. దాన ధర్మములు చేయుటయం దెల్లపుడును నందనప్రిన్స్, (రాజపుత్ర) నామముయొక్క గౌరవము ఇనుమడింపఁజేయు చుండెడివాఁడు. స్వదేశమునకు హితకరము లగు కార్యములను జేయుటకుఁగాని, దాని యున్నతికిఁగాని యాతఁ డెపు డెంత దాన మొసంగెనో లెక్కింపవీలు లేదు. ఆ దానము లల్పము లైనవియుఁ గావు. నిజ ముగ నవి రాజకుమారులకే తగియున్నవి.

కావున నాతఁడు విపులధనరాసుల నార్జించినట్లే వ్యయముఁ గూడ నతులముగఁ గావించెను. కావుననే యాతఁ డధికముగ ఋణముఁగూడఁ జేయవలసివచ్చెను. ఆయన మరణానంతరము దేవేంద్రనాథుఁడు సమస్త విషయ సంపదల భారమును పొంది నపుడు నలువైపుల విపులములగు పైతృకఋణము లుండెను. దేవేంద్రనాథుఁ డీదెబ్బకుఁ దాళజాలఁ డని యందఱును లోలో నఁ దలంచిరి. హితకాంక్షులగు స్నేహితు లనేకు లాయప్పుల నన్నిటిని నీమీఁద వేసికొనక శాంతముగఁ గూర్చుండు మని సలహాల నొసఁగి యుండిరి.

అట్లు చేయఁగా ననుకూలతకూడ నుండెను. ఆయన తన యిచ్ఛానుసారముగ నాయప్పు లన్నిటి నొప్పుకొనకున్నచో నాయన నెవ్వరు నేమియుఁ జేయఁజాలరు. అప్పిచ్చినవారి కొక్క దమ్మిడి యైనను ముట్టదు. అందఱును సంపూర్ణముగా మోసగింపవచ్చును. కాని దేవేంద్రనాథుఁ డట్టి యధర్మకార్యమాచరింపఁగలఁడా?

ఆయన తన మనస్ఫూర్తిగా సమస్త పైతృకఋణములను దన తలపై వేసికొనెను. అందఱును గనియు వినియు నత్యాశ్చర్యాన్వితు లైరి. అర్థశాస్త్రవేత్త లనేకు లాయనను బుద్ధిహీనుఁడని యాక్షేపింప మొదలిడిరి.

అప్పటినుండియు దేవేంద్రనాథుఁడు దీనదరిద్రవేషమును ధరించెను. అత్యంతమితవ్యయముతో సామాన్యునివలె సంసారమును గడపుకొని క్రమముగా విపులములగు తండ్రిగారి ఋణములను గవ్వలతోఁగూడ దీర్చివైచి సంపూర్ణముగ ఋణవిముక్తుఁ డాయెను. ఇట్టి సత్కార్యమునకుఁ బ్రతిఫలము నొసఁగక భగవానుఁ డూరకుండునా? ఆయనకు మరలఁ గ్రమముగా ననంతైశ్వర్యరాశులను విపుల గౌరవము నొసఁగి బహూకరించెను.

ఈసారి యాతఁడు ధర్మసంస్కారకార్యమునందును,సంఘోన్నతికర కార్యమునందును, పరిచారకార్యమునందును, మనస్సును నిమగ్నము చేసెను. స్వర్గస్థ రాజా రామమోహనరాయ

లేయుత్తమధర్మమునకుఁ బునాదివైచి తన హస్తమునం దుంచి చనియెనో దాని కాతఁ డుత్తరసాధకుఁ డాయెను. బ్రాహ్మధర్మ మెట్లు దేశమునం దందఱకు నాదరణీయము కాఁగలదో, దేశీయు లెట్లు తమ తమ యిచ్ఛానుసారముగా వచ్చి యా ధర్మమును స్వీకరింపఁగలరో, దేశమునుండి మిషనరీల యాధిపత్య మెట్లు తొలఁగిపోఁగలదో, క్రైస్తవధర్మమునకంటె బ్రాహ్మధర్మము పైఁ బ్రజల కనురాగ మెట్లభివృద్ధినందఁగలదో యను విషయ ములను గుఱించియే రాత్రింబవళ్ళు చింతించి తత్ప్రయత్నముల యందు సదా నిమగ్నుఁ డగుచుండెను.

రామమోహనరాయ లా ధర్మమును బ్రచారము చేయ నవలంబించిన పద్ధతులు సాధారణప్రజల కత్యంతమును గఠినములుగను, దురవగాహములుగను నుండెడివి. కావునఁ బ్రజ లాసమయమున వాని మర్మమును గుర్తెఱుంగకపోవుటచే నాధర్మముపై ననురక్తులు కాలేదు. దేవేంద్రనాథుఁ డీవిషయమును గ్రహించి దేశీయు లందఱును సర్వసాధారణముగ నీధర్మసారతత్త్వమును సులభముగా గ్రహింప ననుకూల మగుమార్గముల నవలంబించి యావిధమున బ్రాహ్మధర్మప్రచారము చేయ మొదలిడెను. ధర్మమును గ్రహించుట యొక విషయము. ఆ ధర్మమును సాధనచేసి పాలించి దానిపారమును ముట్టుట మఱొక విషయము. రామమోహనరాయలు వ్రాసిన పుస్తకములవలనను, ఆయన యొసంగిన యుపన్యాసములవలనను బ్రజలు ధర్మసాధనము చేయుటకుఁ

దగిన సులభమార్గములను జూడఁజాలకపోవుటచే దేవేంద్రుఁ డామార్గములను వానియుపాయములను జూపింప నారంభించెను.

ఆయన ప్రప్రథమమున ననేకస్థలములయందు బ్రహ్మసమాజములను స్థాపింపనారంభించెను. అనంతర మాసమాజములలో నెట్టిప్రణాళిక నవలంబింపవలయునో స్థిరపఱిచెను. బ్రాహ్మధర్మము నెట్లు స్వీకరింపవలయునో, బ్రాహ్మధర్మసంగతములగు నుపాసనల నెట్లు జరపవలయునో, యాధర్మము నెట్లు పాలింపవలయునో, బ్రాహ్మణు లేయే కార్యముల ననుష్ఠింపవలయునో, యా పద్ధతు లన్నియు నెట్లుండవలయునో యను విషయముల నన్నిటికిని గొక నియమప్రణాళిక నేర్పఱిచెను.

ఈబ్రాహ్మధర్మమునకు మూలము హిందువుల వేదాంతము; దీని నియమములు, పద్ధతులు, అనుష్ఠానములు మొదలగున వన్నియు వేదాంతానుసారముగా నిర్ధారణ చేయఁబడినవి. ఈ వేదాంతము మిక్కిలి కఠినశాస్త్రము. గొప్ప పండితుల కైన నిది సమగ్రముగా గ్రహించుట సులభ మైనవిషయము కాదు. కాని వర్తమానకాల మూఢాచారములయందుఁ బడియున్న హిందువులకు నీ వేదాంతశాస్త్రమునకు నత్యధికమగు భేదము గలదు.

కావున నీవేదాంతము ననుసరించి దేవేంద్రనాథుఁడు బ్రాహ్మ ధర్మాచారమునను ష్ఠానములను, నియమప్రణాళికను, ఏర్పాటు చేసినపుడు, ఆదిబ్రాహ్మసమాజమునకుఁ జెందిన కొందఱకుఁ

బూర్వాచారపరులగు హిందువులతోఁడ మతభేదము లేర్పడెను. కాని దానికి మీమాంసచేయువా రెవరు? ఈవంగదేశమున వేద రహస్యముల నెఱింగిన మహాపండితు లెవరును లేకుండిరి. అపు డాయన యీదేశమునుండి నలుగురు మంచిపండితులను వేదములును, వేదాంతములును జదువుకొని వచ్చుటకు కాశికిఁ బంపి యుండెను. అచ్చట వారు కొన్నిసంవత్సరము లుండి పరిశ్రమము చేసి వేదములను వేదాంతములను జక్కఁగఁ జదువుకొని వచ్చిరి. దేవేంద్రనాథుఁడు బ్రాహ్మధర్మమునుగుఱించి యేయే విషయములు చెప్పియుండెనో యవి యన్నియు వేదవేదాంత సమ్మతములయినవే యని వారు సప్రమాణముగఁ జెప్పఁగలిగిరి. అపుడామతభేదము లన్నియు సమసిపోయెను. బ్రాహ్మధర్మ మున్నతిమార్గమున నంతకంతకు ముందుకుఁ బోవుచుండెను. ఆ నలుగురు పండితులందును గాశినుండి మొట్టమొదట 'వేదాంతవాగీశుఁ'డను పట్టమును బొందివచ్చిన మహాపండితుఁ డగు నానందచంద్రుని దేవేంద్రనాథుఁడు బ్రాహ్మసమాజాచార్యునిగా నియమించెను.

కాని బ్రాహ్మధర్మ పాలనమునకు నా ధర్మసంబంధ మగు క్రియాకలాపముల ననుష్ఠించుటకును మాటిమాటికి వేదాంతములను జదువవలె నన్న నది యందఱకు నసాధ్యమని తలంచి దేవేంద్రుఁడు సుబోధమములగు మతధర్మగ్రంథములను వ్రాసి ప్రచురింప నారంభించెను. దేవేంద్రనాథుఁడు రచించిన పుస్తకములే

బ్రాహ్మధర్మమునకు మూలాధారదండములై యీదేశమున నీ యుగమున మతధర్మగ్రంథములై యుండెను.

కేవలము నంతమాత్రముతోడనే దేవేంద్రుఁడు తృప్తిఁజెంది యూరకుండలేదు. అప్పటి వార్తాపత్రికలందును, మాసపత్రికలందును బ్రాహ్మధర్మమునుగుఱించి సర్వదా వ్యాసములను వ్రాయ మొదలిడెను. అవకాశమున్నపుడెల్ల నుపన్యాసము లిచ్చి చిన్నలకును పెద్దలకును, ధనికులకును, బీదలకును, పండితులకును పామరులకు నెల్లరకును బాగుగా ధర్మమును బోధించుచుండెను. ఆయన పుస్తకములును, వ్యాసములును, మృదుమధురములై, సరళములై, చిత్తాకర్షకములుగ నుండెను. ఆయన యుపన్యాసములుగూడ నట్లే రసయుక్తములై, మధురములై, జనసామాన్యహృదయముల నాకర్షించునవిగా నుండెను. వేదములు వేదాంతములు, మొదలగు వైదికగ్రంథములలోని కఠినములగు మంత్రముల నన్నిటి నాతఁడు మిగుల సులభమును, సరళమును, మధురమునగు వంగభాషలోనికి మార్చి, వానియర్థమును వ్రాసి ప్రకటించి సాధారణప్రజలు గ్రహించుటకు మిక్కిలి సులభముగ ననుకూలముగ నుండునట్లు చేసెను. దీనివలన నందఱును మిగుల సులభముగ బ్రాహ్మధర్మతత్త్వమును గ్రహింపఁగలిగి యానందము ననుభవించుచుండిరి. దేవేంద్రనాథుఁడు చేసిన యీ పని, సామాన్యశక్తియు సామాన్య పాండిత్యము నున్నంతమాత్రమున జరుగునది కాదు.

వేదములు, నుపనిషత్తులును మొదలగు శరీరశాస్త్రము లన్నిటి నెట్టి ఛందస్సుతో నేవిధమునఁ బఠింపవలయునో, యే స్థానమునం దేవిధమున నుచ్చరింపవలయునో యట్టి నిబంధములఁ జాల శ్రద్ధతో విద్యాంసులకు నేర్పుచుండెడివాఁడు. దీని కెంత శక్తి, విద్య, చర్చ యావశ్యకములో యూహించుకొనుఁడు.

కాని కేవలము ధర్మతత్త్వమును, హిందూశాస్త్రములను మాత్రమే గ్రహించి యంతటితో నూరకుండక, దాని ననుసరించి సకలాచరణములను, గ్రియాకలాపములను, బూజను, ధ్యాన ధారణములను జేయ నేర్చుకొని యుండఁటును దిన దినము ధార్మికులగునట్లును, భగవానుని స్వరూపమును గ్రహించి దిన దినము నాయన వైపున కాకర్షింపఁబడునట్లును దుదకాయనను బొంది మానవజీవితమును సార్థకపఱచుకొనునట్లును, ఆయన స్వయముగ బ్రాహ్మధర్మమున కాచార్యులై తన దృష్టాంతమును జూపి చాలశ్రద్ధతో నందఱకును బోధింప మొదలిడెను.

ఈవిధముగా బ్రాహ్మధర్మము దినదినము నున్నతినంది దేశమందంతటను బ్రచారిత మగుచుండెను. ప్రతిదినము నెందఱో యాధర్మము నవలంబించుచుండిరి. చూచుచుండఁగనే యిది నలువైపుల విపులముగ వ్యాపింపనారంభించెను. దేశమునందు ధర్మవిద్యయేకాక నూతనయుగముసైత మారంభ మయ్యెను.

ఈకారణముచేతనే యప్పటినుండియు నీదేశమునఁ గ్రైస్తవ ప్రవాహము తగ్గిపోయెను. పాదరీల యాధిపత్యము లోపింపఁ

జొచ్చెను. హిందూదేశమున మరల సత్యధర్మము నవబల ముతో, సగౌరవముగఁ దలయెత్తి నిలువఁగలిగెను. దేశమం దం తటను నవజీవనము ఆనందరసవాహినీప్రబలతరంగములఁ బొంగి పొరలి ప్రవహింప మొదలిడెను.

నేఁటికి స్వర్గీయ రాజా రామమోహనరాయలు పడిన శ్రమకును, జేసినపనులకును ఫలము గలుగనారంభించెను. ఈవిధ ముగ ధర్మవీరుఁడును, కర్మవీరుఁడును, జ్ఞానవీరుఁడు నగు దేవేం ద్రుఁడు దేశమునకుఁ జేసినకార్యములును, గావించినసేవయు నీదేశపు జాతీయేతిహాసమునందు శాశ్వతముగ స్వర్ణాక్షరము లతో లిఖితమై యున్నది.

వీరియనంతరము దేశక్షేమమునకును, లోకకల్యాణమును, సంఘోద్ధరణకునుబాటుపడి శాశ్వతనామము నక్షయకీర్తిని నిలిపి పోయినవారందఱును సర్వవిధముల దేవేంద్రనాథునకు ఋణపడి నవారే యగుచున్నారు. ధన్యాభిధానులుగను, మహాపురుషు లుగను బూజింపఁబడిన స్వర్గీయ కేశవచంద్రసేనులవారీ మహా పురుషుని కత్యంతప్రియులగు ప్రధానశిష్యులు.

## దశమప్రకరణము

### మహర్షి

లోకుల రుచులు భిన్నములు; కాలమును వయస్సు ననుసరించి యందఱ రుచియుఁ గొంచెముగాకున్నఁ గొంచె మయినను మాఱుచుండును. ఇదియే మనుజుని స్వాభావికధర్మము. కనుక బ్రాహ్మసంప్రదాయము వృద్ధి యగునపుడు నానావిధములగు మనుష్యులును వచ్చి చేరి దినదినము బ్రాహ్మదళమును వృద్ధి చేయ మొదలిడిరి.

మనుజుల భావములు మాఱినకొలఁది వేఱువేఱు స్థానముల వేఱువేఱు సమాజములను స్థాపింపఁగోరు చుండిరి. కాని యెన్ని సమాజములను నెలకొల్పినను వానియందు మూలసత్యములకు వైరుధ్యము గలుగకుండుటకై యాదిబ్రాహ్మసమాజ ప్రధాన పురుషులు ప్రయత్నించు చుండిరి. అతఁడు పరమజ్ఞాని, మానవ హృదయముయొక్కయు, విశ్వ ప్రకృతియొక్కయు స్వభావమును ధర్మము నాతఁడు చక్కఁగా నెఱుఁగును. విశ్వప్రకృతి పరివర్తనశీలమయినది. కాలక్రమమున సామాజికాచారవ్యవహారములన్నియు మాఱుచునే యుండును. ఒక్కతీరుననే శాశ్వతముగ నెవరు నెట్టి నియమప్రణాళికను నియమించి యుంపఁజాలరు. ఈవిషయము నాతఁడు చక్కఁగా గ్రహించెను. కావున సమాజమువారు వేఱువేఱు సమాజముల స్థాపింప ననుమతిని

గోరినపుడు చాల సంతోషముతో నాతఁడు వారి కనుమతి నొసంగెను. కాని ఒక విషయమునందు మాత్రి మెల్లరను శ్రద్ధఁ బూనుఁ డని చెప్పియుండెను.

వారిట్లు చెప్పిరి— "ఎవ రైనను దేశముయొక్కయు, మానవులయొక్కయుఁ, గల్యాణార్థమై భిన్నభిన్నపరిణాళికలతో బ్రాహ్మసమాజములను స్థాపింపఁగోరినయెడల స్వేచ్ఛగా నట్లొనర్పవచ్చును. కాని యందఱు నొకవిషయమునందు మాత్రము సావధానులై యుండవలెను. భిన్నభిన్నసమాజము లభిప్రాయభేదములకై కాని భిన్న కార్యపరిణాళికలకై కాని పరస్పరతర్కవితర్కములకును వాదోపవాదములకును దిగఁగూడదు. ఎవరేమార్గముఁబట్టి నడచినను నెల్లరియుద్దేశములు నేకమై యుండవలెను. అందఱు నాయొక్క పరమేశ్వరునే యుపాసించుచున్నామనువిషయము నెల్లపుడును జ్ఞాపకముంచుకొనవలయును."

దేవేంద్రనాథుని యీయుపదేశానుసారముగా బ్రాహ్మసమాజికు లనేకసమాజములను స్థాపింప మొదలిడిరి. కాని యందఱును దేవేంద్రుని గురుతుల్యునిగ గౌరవించి నడుచుటచే వారిలో నెవరికిని బరస్పరవివాదము లేర్పడలేదు. అపుడా బ్రాహ్మసంఘములన్నియుఁ దమతమ యిష్టానుసారము దేశమున నలువైపుల ధర్మప్రచారము సలుప నెమొదలిడినవి. దీనివలన బ్రాహ్మసమాజమునం దనేకులు చేరి బ్రాహ్మ్ములగుచుండిరి.

మహాప్రభువగు గౌరాంగుఁడు పాత్రాపాత్రములనువిచా

రింపక, భేదాభేదములఁ బాటింపక, స్త్రీల కేమి, పురుషుల కేమి, నీచుల కేమి, శ్రేష్ఠుల కేమి, పండితుల కేమి, పామరుల కేమి, పుణ్యవంతుల కేమి, పాపుల కేమి, మానవుల కెల్లరకును హరినామమునుపదేశించెను. దేవేంద్రనాథుఁడు నట్లే జనుల కందఱకును భేదమును బాటింపక బ్రాహ్మధర్మమును వేదాధికారము నొసఁగుచుండెను. ఇది సనాతనవైదికధర్మానురాగులగు హిందువులకుఁ గంటక మయ్యెను. వారు దేవేంద్రనాథునియెడల మిగులఁ గోపోద్దీపితులైరి.

స్త్రీలకును, శూద్రులకును వేదాధ్యయమునం దధికారము లేదు. ఇది శాశ్వతమగు వైదికపద్ధతి; కావున దేవేంద్రుఁ డాసంస్కారముయొక్క మూలమునం దొకదెబ్బ వేసి ఖండించి స్త్రీల కేమి, శూద్రుల కేమి, నీచుల కేమి, పతితుల కేమి యందఱకును వేదమంత్రమున దీక్ష నిచ్చి యధికార మిచ్చి బ్రాహ్మధర్మప్రచారమున దృఢవ్రతుఁ డయినపు డది వారెట్లు సహింపఁగలరు?

సనాతనధర్మము లోపించునను భయముచేత వారు ఘోరాందోళన మారంభించిరి. దేవేంద్రనాథు నణఁచుటకును, బ్రాహ్మధర్మమును బ్రాహ్మసమాజమును వినాశ మొనర్చుటకును వారనేకవిధములఁ బ్రయత్నములు గావించు చుండిరి. కాని యెవరి యుద్దేశము మహత్తరమయినదో, యెవరు సంపూర్ణముగ నిష్కాములో, స్వార్థరహితులో కేవలము పరోపకారమునకై దేశక్షేమమునకై యెవ రాత్మసమర్పణమును గావించెదరో వారి యున్నతోదార చరిత్రలను ప్రజలు గ్రహించినను గ్రహింపకపోయి

నను స్వయముగ భగవానుఁడే వారికి సహాయుఁడై వారిప్రయత్నములను సిద్ధిఁబొందించును. దేవేంద్రనాథుని జీవితమునందట్లే జరిగెను.

ఈవిధముగా ధర్మప్రచారము చేయ సమకట్టి శ్రీ చైతన్య మహాప్రభువు దేశీయులవలన నెన్నియో బాధలకు గుఱి యయ్యెను. దేవేంద్రనాథుఁడుగూడ నట్లే నానావిధము లగు నిందలను, బాధలను సహింపవలసి వచ్చెను. కాని యా చైతన్యప్రభువువలెనే వాని నన్నిటిని యెంతమాత్రమును లక్ష్యపెట్టలేదు. నిర్విఘ్నముగ స్వచ్ఛందముగ వాని నన్నిటిని దలపై వేసికొని మనోధనశరీరముల నన్నిటిని సమర్పించి తనలక్ష్యమును స్థిరముగ నుంచుకొని సుస్థిరభావముతో దృఢపాదవిన్యాసములతోఁ దన కర్తవ్యమార్గమున నడువఁ జొచ్చెను.

దీనివలన నాతఁ డొక్కనాఁ డైనను నిరాశఁ జెందలేదు. ఒక్కముహూర్తమున నైన నాతనిముఖారవిందమున విషాదచ్ఛాయ క్రమ్మలేదు. ఆయన యానందమయసౌమ్యమూర్తికి మాలిన్య మెట్లుసోఁకును? ఆసదానందుఁడును, పరమజ్ఞానియు, దైవోపమమహాపురుషుఁడును దేవతవలెనే సుస్థిరుఁడుగను నానందమయుఁడుగను నిర్మలుఁడుగను నుండెను.

గృహస్థధర్మమునం దుండిన బ్రహ్మజ్ఞానము పొంద వీలులేదు. ఇది యందఱకును గల నమ్మకము. రామమోహనుఁడు శాస్త్రప్రమాణములను జూపి యిది సంపూర్ణముగ దురభిప్రాయమే

యని చాటియుండెను. గృహస్థధర్మమున లిప్తుఁడై యుండియు సంసారమున సంసారియైయుండియు బ్రహ్మజ్ఞానము నందఱును బొందఁగలరు. కాని మనశాస్త్రములందు వసిష్ఠుఁడు జనకుఁడు మొదలగువారి యుదాహరణములు వందలకొలఁదిగ నున్నను రామమోహనుఁ డది ప్రమాణములతోఁ జూపియున్నను దానిని గుఱించి యందఱకును ధృఢమగు నమ్మకము కుదుర లేదు. కావున దేవేంద్రుఁడు తన జీవితమునందుఁ బ్రమాణముగ నందఱియెదుటఁ జూపుటకై స్వయముగఁ దాను నిర్లిప్తుఁ డైనట్టి సంసారి యయ్యెను. ఈవిధముగఁ దనజీవితదృష్టాంతములను లోకులకుఁ జూపింపకున్నచో నట్టి దురభిప్రాయము నేఁటిదనుక దూరమయ్యెడిదో లేదో సందేహమే. దురభిప్రాయమును దేవేంద్రుఁడు దూరముచేయఁబట్టియే నేఁడు హిందూధర్మ మింతటి యౌన్నత్యముఁ బొందియున్నది. కావున దేవేంద్రుఁడు దేశమునకై సమస్తహిందూజాతికై చేసినసేవయు, మహోపకారమును అతులములై యున్నవి.

బ్రహ్మజ్ఞానియు గృహస్థుఁడు నగు దేవేంద్రనాథుఁడు గృహమునందుండి సాధనముఁ గావించినట్లే తీర్థస్థలములందును సంసారము నేర్పఱచుకొని సాధనముఁ జేయక వెనుకంజ వేయలేదు. శైశవమునుండియు నాతఁడు ప్రకృతిరాజ్ఞికిఁ బ్రియసేవకుఁడు. ఆమాతృప్రసాదముచే నాతఁడు ప్రప్రథమముననే బ్రహ్మజ్ఞానమూలమంత్రరూపమగు వరముఁ బొందియుండెను. ఆమెయొడి

యందే నిలిచి సాధనభజనలఁ గావించి యామంత్రముచేతనే సిద్ధిఁబొందెను.

ఇప్పటి తీర్థస్థానములు దేవేంద్రునిమనస్సునం దెట్టివ్యాకులత్వమును గలిగింపలేకపోయెను. కావున నాతఁడు వానిప్రమేయమును విడిచి వైచెను. ఏస్థానములందుఁ బ్రకృతిదేవత తనషోడశకళలను, సౌందర్యప్రతిభను, విస్తరింపఁజేసి వికాసవంత మొనర్చునో యాస్థానము లన్నిటియందును నామె వివిధరూపములును వివిధాకారములును దాల్చి ప్రకాశించు చుండును. ఏయేస్థానములయందు శాంతమూర్తిని ధరించి ప్రకృతిదేవి నిద్రించునో యట్టి యా సకల ప్రకృతిలీలానికేతనములే దేవేంద్రుని పుణ్యతీర్థములు.

జగత్పూజ్య మగు హిమవత్పర్వతపంక్తుల నిర్జనవక్షస్థలమును, మహోన్నతశిఖరప్రదేశములును నిరంతరభైరవగర్జనము లొనర్చుచు, నున్మత్తతరంగముల నుప్పొంగుచు నల్లకల్లోలముగ నుండు సాగరవక్షస్థలమును, సతతము నృత్య మొనర్చుచుఁ గలకలారావములఁ గావించుచు దేవసంగీతముచే ముఖరితములగుచు నున్న గంగాబ్రహ్మపుత్త్రిల చిరతరాగాధప్రవాహములును, వీరభూమి కంతర్గతమయి సుదూరవ్యాప్తమయి గ్రీష్మ-వర్షా-శీత-వసంతసౌందర్యములచే విభూషితమయి, నిరాటంకవాయుప్రవాహములచే శ్యామలాకారముందాల్చియున్న ప్రాంతములును—ఇట్టి ముక్తప్రకృతియొక్క నగ్నసౌందర్యరూపములగు మహాతీర్థ

క్షేత్రములందుఁ గూర్చుండియే దేవేంద్రనాథుఁడు పరబ్రహ్మ సాధనముఁ జేయుచుండువాఁడు.

ఆయన తన జీవితకాలమునం దెక్కువ కాల మిట్టి వివిధ ప్రకృతిసౌందర్య విభూషితములును శాంతిపూర్ణములు నగు స్థానములందుఁ గూర్చుండియే దేవేంద్రనాథుఁడు యోగసాధనముఁ గావించెను. ఆయన అకుంఠనిమగ్నసంసారియై తనసువిశాలమగు జమీందారీయందలి లక్షలకొలఁది ప్రజలను, వేలకొలఁది యాశ్రితజనులను, దనకుటుంబమును, బరివారము నందఱను సర్వదా సమానముగఁ గనిపట్టి సుఖపెట్టఁ గలిగెను. ఆయనకుఁ దనజీవితమునందు ఏకమాత్రమై ప్రధానమైన వ్రతము బ్రాహ్మధర్మప్రచారమై యుండెను. సకల స్థానములందును, సకల సమయములయందును, సకలావస్థలయందు నాతఁడు ప్రాచీనకాలము నాఁటి యార్యఋషీశ్వరులవలె సంపూర్ణ మగుశుద్ధ సరళ నిర్మల భావములతోనుండి యాపామర సాధారణప్రజల కందఱికి నమృతమువలె ధర్మముయొక్క మధురాస్వాదనమును విమలశాంతిని బ్రసాదించి యుండిరి. అప్పటినుండియు దేశమునఁ జిన్నపెద్దలందఱు నాతని యీయపూర్వజీవితమును, ఈయపూర్వదృష్టాంతమును, ఈయపూర్వ శక్తినిఁ జూచి దేవేంద్రనాథుని "మహర్షి" యని గౌరవింప నారంభించిరి. దేశమునం దెల్లరచే నేకగ్రీవముగా గౌరవింపఁబడి శ్రద్ధాభక్తులచేఁ బూజింపఁబడి సమర్థింపఁబడిన యాయన మహర్షిగౌరవపట్టము మఱి యితరు లెవ్వరికిని

నేఁటివఱకు లభించు భాగ్యము సంభవింప లేదు. నాఁటికిని నేఁటికి నది యాతని కొఱకే లభించినది. శోభించినది.

-

# ఏ కా ద శ ప్ర క ర ణ ము

## శాంతినికేతనము

ధర్మమార్గమున నేమానవుఁడును గురువై దేవేంద్రనాథునికెన్నఁడును మార్గమును జూపియుండలేదు. ప్రకృతియే యాతనికిఁ బ్రధానగురువు. శైశవమునఁ దదేకదృష్టితో రాత్రులం దాకాశమున దృష్టి నిలిపి యుండుటచే నాతనికి లభించిన బ్రహ్మజ్ఞానాంకుర మాతఁడు తన జీవిత మంతయుఁ బ్రకృతియొక్క క్రోడమున భిన్నభిన్నసమయముల వివిధావస్థల సౌందర్యవారాశి యందు నిమగ్నుఁడై నిలిచి యావిషయముయొక్క ధ్యానధారణముఁ జేయుటచేత బృహత్తరమగు వృక్షమై పరిణమించినది. కావుననే దేవేంద్రనాథుఁడు నిర్జనప్రకృతియొక్క మనోహర క్రోడమునఁ గూర్చుండి యారాధనఁ జేయ నభిలషించువాఁడు. ఎప్పు డేమాత్ర మవకాశము దొరకినను బరుగిడి బయటికి వచ్చి యేదోయొక ప్రకృతిక్రోడమునఁ గూర్చుండి ధ్యాననిమగ్నుఁడగుచుండెడువాఁడు. గాఢసంసారి యయ్యు దేవేంద్రనాథుఁడు మహాత్యాగి, ఉదాసీనుఁడు, నిర్జనతాప్రియుఁడు. ఆయన బాల్య

మందేమి యౌవనమందేమి ప్రౌఢవయస్సునందేమి వార్ధక్యమందేమి జీవితమునందన్నియవస్థలందును సకలసమయములందును గాఢతరముగ సంసారబంధములచేఁ జుట్టఁబడియుండియు మిక్కిలి నిర్లిప్తభావమున నుండువాఁడు. కావున నతని ధ్యానధారణములు నాతని సంసారయాత్ర యేదియు నాతనికిఁ గఠినముగఁ దోఁచెడిది కాదు. సామాన్యగృహస్థులకుఁ గూడ నీసంసారమును విడిచి జీవితకాలమునందెచ్చటికేని కొంతకాలము పోయి యొక్కింత విశ్రమింతమన్న నవకాశ ముండదు. కావున నందులకై యందఱును విచారించుచునే యుందురు. కాని దేవేంద్రనాథుఁడు విశాలమగు జమీందారీభారమును దలపై వేసికొనియు సంఘసంస్కారధర్మప్రచారకార్యములయందు నిరంతరమును మునిఁగి యుండియు దేశముయొక్కయుఁ బ్రజలయొక్కయు మంగళముకొఱకై యున్నతికొఱకై యెల్లప్పుడు నేదో యొకకార్యమునందు నిమగ్నుఁడై యుండియు సకలసమయములందు నేకాంతమున కేఁగి పరమాత్మను ధ్యానముసేయ నెంతయు నవకాశముఁ బొందెడివాఁడు. దీనికిఁ గారణ మాతని సంపూర్ణ నిష్కామనిర్లిప్తభావము గాక మఱొండు గాదు. ఈవిధమున దినదినమును బ్రాహ్మధర్మము దేశమున విపులముగా వ్యాపించుట కారంభించెను. ప్రతిబ్రాహ్మమతస్థుఁడును భిన్నభిన్నస్థానములలో బ్రాహ్మసమాజములను స్థాపించి యాకార్యములందుఁ బ్రవర్తింపఁదొడఁగిరి. అప్పటికి దేవేంద్రుఁ డొక్కించుక యూరటఁ జెందెను. నిరంతర

కార్యనిమగ్నతనుండి బయటపడి యొక్కింత సమయము కొత్తు కొనుటకవకాశ మిప్పుడు దొరకినది.

యువకబ్రాహ్మవు లందఱు నున్నతవిద్యావంతులును బుద్ధిమంతులును ధర్మనిష్ఠాపరులును త్యాగశీలురు నై యుండిరని యాతఁడు గ్రహించెను. వారిలోఁ దనకుఁ బ్రియతమశిష్యుఁడగు కేశవచంద్రుఁడు సకల సద్గుణముల నెల్లరకంటె శ్రేష్ఠుఁడు. అతఁడు ధర్మనిష్ఠాపరుఁడు; స్వతంత్రచేతస్కుఁడు; మనోహరకంఠస్వరము కలవాఁడు; పండితవరేణ్యుఁడు; నిరంతర పరిశ్రమశీలుఁడు; మహావక్త. ఈసులక్షణము లన్నింటిని గాంచి దేవేంద్రనాథుఁడు కేశవచంద్రసేను నాదిబ్రాహ్మసమాజమున కాచార్యునిగ నియమించి తాను విశ్రాంతినిబొంది తనయంత్యజీవితమున వానప్రస్థము నవలంబింప నిచ్ఛగించెను.

ఈదేశమునఁ బ్రాచీను లగునార్యఋషిపుంగవులు, మానవుఁడు ప్రథమమునుండియుఁ దుదివఱకు నే యే యాశ్రమములయందుండి యెట్టికర్తవ్యములఁ బాలింపవలయునని యాదేశించియుండిరో దేవేంద్రనాథుఁడు వారియాదేశానుసారముగా నాయాయాశ్రమధర్మముల నన్నిటిని గ్రమప్రకారము పాలించినాఁడు. ఇంక నిపుడాయనజీవితమునం దొకటియే నిలిచియున్నది. వానప్రస్థధర్మమవలంబించి యంత్యజీవితము నాయాశ్రమమునం దే గడుపవలసియున్నది.

ఈ కోర్కె చేత నే యాయన తనస్థానమున నాదిబ్రహ్మసమాజము

రియొక్క యాచార్యపదవియందు యోగ్యుఁడగు కేశవచంద్రుని నియమించి తాను విశ్రాంతినొందెను. అనంతరము వీరభూమి యందలి బోల్పురమునం దొకనిర్జన మైనట్టియు, సువిశాల మైనట్టి యు నొకపర్వతప్రాయప్రదేశమును గొని తన యంత్యజీవితమున ధర్మాచరణమునకై యచ్చట నొకయాశ్రమమును నెలకొల్ప నుద్యుక్తుఁడై యథాసమయమున దానిని బ్రతిష్ఠించెను. అచ్చటికేఁ బోయి మహర్షి దేవేంద్రనాథుఁడు వానప్రస్థము నవలంబించిసంసార సంబంధము లన్నిటిని విడనాడి యహోరాత్రము లేకాంతమతియై బ్రహ్మారాధనయందు నిమగ్నుఁడై యుండెను.

దేవేంద్రనాథుఁ డీవృద్ధవయస్సునందు వానప్రస్థధర్మ మవలంబించి యనుష్ఠానముచేయుట కేర్పాటు చేసికొన్న స్థానముపేరే "శాంతినికేతనాశ్రమము" లేక "శాంతినికేతనము."

దేవేంద్రనాథుని బ్రాహ్మమతస్థులందఱును గురుతుల్యునిగను ధర్మపితగను భావించి యట్టి భక్తిశ్రద్ధాసన్మానము లతనియెడఁ జూపుచుండెడివారు. సదా యతని కనుమతులై యుండువారు. అనంతరము క్రమముగా బ్రాహ్మధర్మము వ్యాప్తమయ్యెను. అందఱు నాదిబ్రాహ్మసమాజముతో నేకాభిప్రాయముగలవా రై యుండకపోయినను వివిధస్థానముల భిన్నభిన్నసమాజములు స్థాపింపఁబడినను నందఱకును దేవేంద్రుఁడే ప్రధాననాయకుఁడును నాచార్యుఁడునై యుండెడువాఁడు. వారందఱును అమృతపూర్ణములగు దేవేంద్రుని యుపదేశముల నెల్లపుడును స్మరించుకొని

పరస్పరము నెట్టి యనైక్యభావములు గాని యీర్ష్యాద్వేష భావములుగాని లేక ఏకాభిప్రాయము గలవారై యుండెడి వారు మున్ముందిట్టి భేదాభిప్రాయములు లేకుండునట్లు నందఱి నొకచో సమావేశపరచుటకు దేవేంద్రనాథుఁ డొక వాత్సరిక "బ్రాహ్మసమ్మేళన" మనెడు సభ నేర్పాటు చేసెను.

1874వ సంవత్సరము నవంబరునెలలో నాతని ప్రయత్నముచే "సమదర్శి" యను నొక మాసపత్త్రిక ప్రచురింపఁబడెను. దేవేంద్రనాథుని నిజగృహమునందే మహావైభవమున నాసంవత్సరము ప్రథమ బ్రాహ్మసమావేశము జరుపఁబడెను.

సర్వసద్గుణములకు నాకరుఁడుగానిచో నెవ్వఁడు నేజాతివారికి నుపదేశకుఁడుగాని, యాచార్యుఁడుగాని, నాయకుఁడుగాని కాఁజాలఁడు. మహర్షి దేవేంద్రనాథుఁడు సర్వగుణాధారస్వరూపియై జన్మించియుండెను. ఆయనవలె సర్వవిషయముల నాదర్శచరిత్ర గల మహాపురుషుఁడు లోకములోఁ గాన్పించుటరుదు. మిత్త్రుల నాదరించి దగ్గరఁజేర్చుకొనునట్లే శత్రువును, అనిష్టకారుని, హింసకుని, తన్ను సదా నిందించువానినిగూడ నాతఁ డత్యాదరముతోఁ బ్రేమించి కౌఁగిలించుకొని ఆయన జీవితమునఁ బ్రపంచమున నొకమహాదర్శమును స్థాపించి గతించియున్నాఁడు ఆయనకీ డగు వా రెవ్వరును లేరు. ఇఁక నాతని దానవిషయము. సకల ధర్మశాస్త్రములయందును దాన ధర్మము లుత్తమకర్తవ్యములని యుల్లేఖింపఁబడినవి. యట్టి యుత్తమ దానధర్మపాలనమున

మహర్షి దేవేంద్రనాథుని ప్రశస్తదానవీరుఁడన్నను నతిశయోక్తి గాదు. ఆయన దానము యథార్థముగ స్వార్థరహితమైనది. హృదయపూర్వకమైనది వాస్తవముగ నాయన కుడిచేయి చేయు దానము నెడమచేయియైన నెఱుఁగదు. ఆయన దానములను బడసి యీలోకమునందెందఱు ధన్యులైరో యాసంఖ్యను వివరింప నెవరితరము ?

బ్రాహ్మధర్మ నియమానుసారముగ దేవేంద్రనాథుఁడు తన దని యీలోకమునం దేద్దానిని నిలిపియుండలేదు. ఆయన కున్న దంతయు భగవానుల చరణములకర్పించి తాను భృత్యుని వలె జీవితము గడపియుండెను. ఇదిగాక బ్రాహ్మధర్మప్రచారమునకై సర్వదా నలువైపులఁ దనహస్తములనుండి ధనమును ప్రవహింపఁజేసెను. ఎన్ని వేలమంది యాపన్నవ్యక్తులకు నొకక్కసారి వేలకొలఁదిగా దానమిచ్చి వారియాపత్తులను దొలఁగించెనో వివరింపఁజాలము. దేశక్షేమమునకై ఏకార్య మెప్పు డెచట ననుష్ఠింపఁబడుచుండినను అచట దేవేంద్రుఁడు తన నిరంతర శారీరక పరిశ్రమమే గాక యజస్రమును సహస్రములకొలఁది రూప్యములను వెదచల్లుచుండువాఁడు. ఎప్పుడే దేశమున దుర్భిక్షముగాని, మారిభయముగాని, జలప్లావనములుగాని సంభవించిన అప్పు డాదేశీయులకై దేవేంద్రుఁ డెంతెంతధన మిచ్చెడివాఁడో యెవరు వర్ణింపఁగలరు. సుదూరవిదేశములందుఁగూడ మానవకళ్యాణార్థమై యాతఁ డెన్నెన్ని విపులదానములను గావించెనో యవి లెక్కకు మిక్కుటములు.

ఈ పుణ్యమయ భారతభూమి యాదికాలముననే సకల పవిత్రార్య ఋషీశ్వరులచే ధన్యమై, పూజనీయమై, శ్రేష్ఠమై యున్నదో, జగద్విఖ్యాతపుణ్యతపోవనములు శాంతికిని జ్ఞానమునకును నాశ్రయములైన విశుద్ధాశ్రమములుండుటచే స్వర్గముతోఁ దుల్యమైయున్నదో మరల నీభారతభూమి నట్టి పుణ్యభూమిగ మార్చివేయుటకై దేవేంద్రుఁడు సకల ప్రయత్నములును గావించెను.

ఆ యుద్దేశముతోడనే ప్రకృతియొక్క నిర్జనము సుందరమునగు నొక శాంతిమయ క్రీడమున నాతఁడు శాంతినికేతనమును స్థాపించెను. ఈయాశ్రమ మా యార్యఋషీశ్వరుల పుణ్యతపోవనమువలెఁ బవిత్రమైయున్నది. ఇచ్చట నిర్జనోపాసనకుఁ దగిన స్థానమున్నది. నిత్యనైమిత్తికపూజకు మందిర మున్నది. తపశ్చరణకు జ్ఞానోపార్జనకు వేదిక యున్నది. సర్వశాస్త్రవిద్యాభ్యాసమునకై తగువిద్యాలయ మున్నది. విద్యార్థిభవనము లున్నవి. సంసారమును ద్యజించిన త్యాగికి బ్రహ్మచర్య సాధనమునకది మహాపీఠమై యున్నది. మఱియునది గృహస్థ తపస్వి కుపయుక్తమగు పుణ్యమయ పవిత్ర సంసారక్షేత్రమై యున్నది.

ఈవిధముగ నీయుగమందు మహర్షి దేవేంద్రనాథుఁడు ధనికుని గృహమందు జన్మించియు నేయసాధారణ మహాకార్యములను నెఱవేర్చి వెళ్లెనో వానినన్నిటిని స్మరించికొనిన ప్రాచీనకాలపు మహర్షుల విషయమే స్ఫురించుచుండును. దేశమునం దిట్టి

దేవేంద్రులు జన్మించియుండిన యెడల యీభారతభూమి పుణ్యగౌరవమయశాంతిభూమిగాఁ బరిణమించుటకు సందేహ మేమున్నది?

దేవేంద్రనాథుని వంశస్థు లందఱును దండ్రికిఁ దగినపుత్త్రులు. ఆయన జ్యేష్ఠపుత్త్రుఁ డగు ద్విజేంద్రనాథుఁడు తండ్రియొక్క ధర్మప్రవణతను బొందెను. కనిష్ఠుఁడగు రవీంద్రుఁడు సరస్వతికి వరపుత్త్రుఁడై యాసియా కవిసార్వభౌముఁడై మహాగౌరవభూషితుఁడై దేశదేశాంతరముల పూజార్ఘ్యము లందుచు మనదేశమును ధన్యము చేయుచున్నాఁడు. ధన్యుఁడు మహర్షి దేవేంద్రుఁడు!

*

* *